## ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత నాదే

### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**చేర్యాల, అక్టోబరు 25,ప్రభాతవార్త :** అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే బాధ్యత తనదేనని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేర్యాల పట్టణంలోని రేణుక ఎల్లమ్మ గార్డెన్‌లో చేర్యాల, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాలకు చెందిన 64 మంది గతంలో అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొంది అయిన ఖర్చులను ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.17,94,500 విలువ చేసే చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందిచే బాధ్యత తనదేనన్నారు.అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారులు ప్రజా ప్రతినిధులు తనకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పుల్లంపల్లి కురుణాకర్,బిఆర్ఎస్ నాయకులు అనంతుల మల్లేశం,శివగారి అంజయ్య,జింకల పర్వతాలు యాదవ్,కొంగర గిరిధర్,పిడుగు మహేష్,తిరుపతిగౌడ్,బిక్షపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట



వార్త

## మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

**కొండపాక, అక్టోబరు 25, ప్రభాతవార్త :** ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని టిప్పర్‌తో అక్రమ రవాణా చేస్తున్న టిప్పర్లను, జెసిబిని సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, కుకునూరుపల్లి పోలీసులు పట్టుకున్నట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కుకునూరుపల్లి మండల పరిధిలోని ముద్దపూర్ శివారులో శుక్రవారం కొంత మంది జెసిబితో అక్రమంగా మట్టిని తవ్వి టిప్పర్లలో తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం ప్రకారం సిద్దిపేట టాస k పోర్స్ సిబ్బందితో పాటు కుకునూరుపల్లి పోలీసులు కలిసి వెళ్లి పట్టుకొని కేసు నమోదు చేసినట్లు అయన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ అదేశాల ప్రకారం సిద్దిపేట జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసిన, నిల్వ ఉంచిన. మట్టి తవ్వి అక్రమ రవాణా చేసిన కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా గ్రామాల్లో, పట్టణాల్లో ఇసుక అక్రమ రవాణా చేసిన, గ్యాంబ్లింగ్, పేకాట, గుట్కాలు కలిగి ఉన్న రవాణా చేసిన మరేదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిసిన పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



పశు వైద్యశాల పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

### పశు వైద్యాధికారులు సమయ పాలన పాటించాలి

**-మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్**

**మెదక్ రూరల్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** పశు వైద్యాధికారులు సమయ పాలన పాటించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మెదక్ మండలం మాచవరం గ్రామంలో ఉన్న పశు వైద్యశాలను, మెదక్ పట్టణంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాక్సిన్ నిల్వ గదిని, పశు వైద్యశాల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు సమయ పాలన పాటించాలని, పశువులకు సమయానికి వ్యాక్సిన్ వేయాలని, ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం జిల్లా గ్రంథాలయాన్ని పరిశీలించారు.గ్రంథాలయంలోని పరిసరాలను, మరుగుదొడ్లను పరిశీలించారు. గ్రంథాలయంలో ఇంటర్నెట్ ఏర్పాటు చేయాలన్నారు. నూతన పుస్తకాలు అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. గ్రంథాలయాన్ని ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గ్రామానికి ఉపయోగపడే పనులు గుర్తించాలి

**అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్**



పోతిరెడ్డిపల్లిలో ఉపాధిహామీ పథకం పనులను పరిశీలిస్తున్న దృశ్యం

**జోగిపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:** రాబోయే సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద చేపట్టేందుకు గ్రామానికి ఉపయోగపడే పనులు గుర్తించాలని అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్ అన్నారు. మండల పరిధిలోని పోతిరెడిపల్లిలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టబోయే పనులను గుర్తించేందుకు గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యంగా గ్రామానికి. రైతాంగానికి ఉపయోగపడే విధంగా పనులు గుర్తించాలని ఆయన సూచించారు. ఈ పథకం కింద పండ్ల తోటల పెంపకం, చిన్నపాటి నీటివనరుల నిల్వ చేసుకునే అవకాశం ఉందని, వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపివో అశోక్, ఏపివో అర్చన, ఇసి ఉదయ్, టిఏ మొగులయ్య, పంచాయితీ కార్యదర్శి సురేఖ, మాజీ సర్పంచు వర్కల అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయండి**

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్‌కు మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. మాజీ సర్పంచ్ వర్కల అశోక్ ఆధ్వర్యంలో గ్రామస్తులు అసిస్టెంట్ కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. మొత్తం 19 పనులకు నిధులు కేటాయించాలని వారు కోరారు. ఇందులో గ్రామానికి చెందిన యువకులు, నాయకులు పాల్గొన్నారు.

### సిద్దిపేటను సందర్శించిన మున్సిపల్ కమిషనర్లు, డిప్యూటీ మేయర్లు



బుస్సాపూర్‌లో బయోగ్యాస్ తయారీకేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్లు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

దేశానికి, రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తున్న సిద్దిపేట మున్సిపాలిటీని ఇతర జిల్లాలకు చెందిన 12 మున్సిపాలిటీల కమిషనర్లు శుక్రవారం సందర్శించారు. సిద్దిపేట మున్సిపాలిటీ సందర్శనలో భాగంగా సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్‌లోని రిసోర్స్ పార్క్‌లోని బయోగ్యాస్ బయో మైనింగ్, ఇన్సినరేటర్ నిర్వహణను పరిశీలించారు. అలాగే మేకలు, గొర్రెలను వదించే స్లాటర్ హౌజ్ నిర్వహణ తీరును పరిశీలించారు. హౌసింగ్‌బోర్డులోని పొడి చెత్త సేకరణ కేంద్రాన్ని(డిఆర్‌సిసి) సందర్శించారు. కమర్షియల్ వేస్ట్ సేకరించి బాసిల్ ఫౌండేషన్ కేంద్రాన్ని సందర్శించారు.సిద్దిపేట పట్టణ మున్సిపాలిటీని ఆదర్శంగా తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్, ఆయా మున్సిపల్ కమిషనర్లు ఖానాపూర్ మనోహర్, బైంసా రాజేష్ కుమార్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ సువర్ణ, ఆదిలాబాద్ క్యూమర్ అహ్మద్, చొప్పదండి నాగరాజు, గ్రేటర్ వరంగల్ డిప్యూటీ కమిషనర్ కె.ప్రసన్నరాణి, నిర్మల్ సి.వి.ఎన్ రాజు, హుజురాబాద్ సోమయ్య, కొత్తపల్లి వేణుమాదవ్ భూపాలపల్లి రాజేశ్వర్ ఉన్నారు.

### కుకునూరుపల్లి ఐటిఐని సందర్శించిన కలెక్టర్

**కొండపాక. అక్టోబరు 25, ప్రభాతవార్త :**

కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి శుక్రవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎటిసిని పరిశీలించారు. అనంతరం పిఎం విశ్వకర్మ పథకం కింద శిక్షణ తీసుకుంటున్న వారు తయారు చేసిన మినియేచ్చర్‌ను పరిశీలించి, నూతనంగా అడ్మిషన్ పొందిన విద్యార్థులకు అడ్మిషన్ స్లిప్‌లను అందించారు. కళాశాల అవరణను పరిశీలించారు.

# హుస్నాబాద్‌లో మెగా ఫారిన్ జాబ్ మేళా

**రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** నవంబర్ రెండవవారంలో హుస్నాబాద్ పట్టణంలో మెగా ఫారిన్ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన చాంబర్‌లో టాంకాం ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో హుస్నాబాద్ ప్రాంత నిరుద్యోగులకు కొన్ని రంగాలలో శిక్షణ కల్పించి వారి స్కిల్ ఆధారంగా వివిధ దేశాలలో మంచి జీతాలతో ఉద్యోగాలు కల్పించేలా మెగా ఫారిన్ జాబ్ మేళాను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళా గురించి నవంబర్ 1వ వారంలో మండలాలవారీగా అవగాహన కల్పించాలని మూడు జిల్లాల కలెక్టర్‌లను ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆసక్తి గల నిరుద్యోగుల వివరాలు సేకరించి విదేశాల్లో ఉద్యోగాలు పొందేలా వారిని ప్రోత్సహించాలన్నారు. ఇప్పటికే హుస్నాబాద్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకి మంచి స్పందన లభించిందని దాని ద్వారా 5 వేల మందికి ఉద్యోగాలు దక్కాయని గుర్తు చేశారు. టాంకాం సంస్థ వారు ఇప్పటికే శిక్షణ ఇచ్చి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు సూచించారు. సమావేశంలో స్పెషల్ సెక్రటరీ ఇండస్ట్రీస్ టాంకాం సీఈవో డా విష్ణువర్ధన్‌రెడ్డి, టాంకాం జీఎం నాగభారతి, షబ్నా తదితరులు ఉన్నారు.

# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**-విద్యాలయంలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం.. ఐఓసి భవనంలో మిగిలిన పనులు పూర్తి చేయాలి..సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి**



కెజిబివి ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**మర్కుక్, అక్టోబరు 25 (ప్రభాతవార్త):** కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినిలు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలని, విద్యాలయంలో అన్నిసౌకర్యాలను ఒక్కొక్కటిగా ఏర్పాటు చేస్తామని సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం మర్కుక్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయంకు కావాల్సిన వసతుల గురించి అడగ్గా విద్యాలయ భవనం రోడ్డు కంటే పల్లంలో ఉన్నందున వర్షాకాలంలో నీరు విద్యాలయ ప్రాంగణంలోకి చేరి చెరువులా తయారవుతుందని, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చాలని, తాగునీటి వసతికి ఆర్ఓ ప్లాంట్, సోలార్ హీటర్ కావాలని ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి కలెక్టర్‌కు తెలిపారు. విద్యాలయ ప్రాంగణంలో నీరు నిలవకుండా మట్టిని పోయించాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా తెలిపారు. అలాగే మౌలిక వసతుల గురించి ఈడబ్ల్యూఐడిసి ఏఈ వచ్చి మీకు కావాల్సిన ప్రతీది నోట్ చేసుకొని అన్నింటికి సంబంధించిన ఎస్టిమేషన్ సిద్ధంచేసి పనులు అయ్యేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అనంతరం విద్యాలయ ఆవరణలో మొక్కను నాటి నీరు పోశారు. అంతకు ముందు మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సమీకృత కార్యాలయ సముదాయ భవనాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సందర్శించారు. భవనం పూర్తయినా చిన్న చిన్న పనులు పూర్తిచేసి ప్రారంభించేవరకు భవనంలో ఆయా శాఖల అధికారులు షిఫ్ట్ కావాల్సిందిగా మండల స్థాయి అధికారులకు తెలిపారు. ఆయనతోపాటు గజ్వేల్ ఆర్డీఓ బన్సిలాల్, తహసీల్దార్ ఆరిఫా, ఎంపిడిఓ అఫ్జలొద్దీన్, ఎంపిఓ లింగం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### రైతు పక్షపాతి సిఎం రేవంత్‌రెడ్డి : ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, అక్టోబరు 25,ప్రభాతవార్త:** రైతు సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఈ క్రమంలో సన్న వడ్లకు మద్దతు ధరక అదనంగా 500 రూపాయల బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఏ వన్ గ్రేడ్ క్వింటాల్‌కు 2320, సన్న వడ్లకు క్వింటాల్‌కు 2820 రుపాయల మద్దతు ధర అందిస్తుందని తెలిపారు. రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటను దళారులకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోను విక్రయించాలని తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ వ్యాప్తంగా 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు రాఘవేంద్ర రెడ్డి, బిక్షపతి, ముత్తంగి మాజీ సర్పంచి ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు పట్టణ అధ్యక్షులు నరసింహరెడ్డి, డైరెక్టర్లు అధికారులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



బయోసైన్స్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

### బయోసైన్స్ ఫోరం మెదక్ జిల్లా నూతన కమిటీ

**మెదక్ మున్సిపాలిటీ, అక్టోబరు 25 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం జిల్లా జీవశాస్త్ర ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. సమావేశంలో బయోసైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు దొంతి ప్రసన్నకుమార్, ప్రధానకార్యదర్శిగా మెరుగు నరేందర్, కోశాధికారిగా సతెల్లి రమణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జీవశాస్త్రం నుంచి ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొంది ఇటీవల మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన ప్రతాప్‌రెడ్డి, రామకిషన్, సురేందర్‌గౌడ్, మాలతీదేవి విచ్చేశారు. వీరిని నూతన కమిటీ శాలువాలతో సన్మానించారు. అదేవిధంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుపొందిన చంద్రశేఖర్, ఇప్పటి వరకు జిల్లాలో జువాలజీ పీజీటీగా పనిచేసి రిసోర్స్ రిసోర్స్‌పర్సన్‌గా సేవలు అందించి బదిలీపై సిద్ధిపేట జిల్లాకు వెళ్లిన చంద్రికదేవి, జీవశాస్త్ర ఉపాధ్యాయులుగా పదోన్నతిపొందిన ఉపాధ్యాయులు, డీఎస్సీ 2024 ద్వారా నూతనంగా విధుల్లో చేరిన జీవశాస్త్ర ఉపాధ్యాయులను ఫోరం తరపున సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ జీవశాస్త్ర సంబంధిత అంశాలలో, పరీక్షా విధానంలో మార్పు, సబ్జెక్ట్ శిక్షణ, సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహణ గురించి అధికారులు సహకారంతో విద్యార్థులు అభివృద్ధికి బయోసైన్స్ ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అశోక్, నాగరాజు, మల్లేశం, రవి, లింగప్రసాద్, శశికుమార్ రెడ్డి, రమేష్, వేణుగోపాల్, అరుణ, ప్రశాంతి పాల్గొన్నారు.

# పోలీస్ గృహ సముదాయాలను సందర్శించిన జిల్లా కలెక్టర్, సిపి



మర్కుక్‌లోని పోలీస్ గృహ సముదాయాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్

**మర్కుక్, అక్టోబరు 25 (ప్రభాతవార్త):** మండల కేంద్రం మర్కుక్‌లోని పోలీస్ గృహ సముదాయాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం. మనుచౌదరి, జిల్లా పోలీస్ కమిషనర్ బి.అనురాధతో కలిసి క్షేత్ర స్థాయిలో సందర్శించారు. కొంత కాలంగా ఈ పోలీస్ గృహ సముదాయం వాడకం లేని కారణంగా దీనిని సాంఘిక సాంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలగా మార్చేందుకు కావాల్సిన మార్పుల గురించి సోషల్ వెల్ఫేర్, పోలీస్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్ శాఖకు సంబంధించిన గృహ సముదాయంలో ఉమెన్ బారెక్స్, మెన్‌బారెక్స్, స్టాఫ్ క్వార్టర్స్ గదులతో పాటు అదనంగా కావాల్సిన ఇతరత్రా పనులు చేసి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్‌కు అందించడానికి వారి రిక్వైర్మెంట్ ఏం కావాలో తెలుసుకోవడానికి జిల్లా యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పరిశీలించామని అన్నారు. కొండపాక మండలంలో అద్దె భవనంలో ప్రస్తుతం కొనసాగుతున్న రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూషన్ పర్మినెంట్‌గా దాదాపు 600 మంది విద్యార్థులతో నడపడానికి కావాల్సిన వసతులు అందించి త్వరలో ఇక్కడికి మార్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ వెల్ఫేర్ వాళ్లు కోరిన విధంగా టాయిలెట్స్, సంపు నిర్మాణం, మిగిలిన రిక్వైర్మెంట్ ఏమైనా ఉన్నా ఇంజనీర్ డిపార్ట్‌మెంట్ వారికి త్వరగా ఎస్టిమేట్ వేసి వర్క్ కంప్లీట్ చేయవలసిందిగా తెలియజేశామని అన్నారు. చుట్టు పక్కల ఉన్న ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్, పోలీస్ స్టేషన్, గెస్ట్ హౌజ్‌లను వాటికి కావాల్సిన బెస్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌తో కూడిన డెవలప్మెంట్‌ను అందించేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలించడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి ఎస్.మల్లారెడ్డి, గజ్వేల్ ఆర్డీవో బన్సిలాల్, సోషల్ వెల్ఫేర్ జోనల్ అధికారి ప్రత్యూష, గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డి, ప్రిన్సిపల్ సవిత, గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కిరణ్, సిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పూర్ణచందర్, మర్కుక్ ఎస్ఐ దామోదర్, తహసీల్దార్ ఆరీఫా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రుస్తుంపేట గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ల బృందం

### రుస్తుంపేట గ్రామాన్ని సందర్శించిన ట్రైనీ ఐఎఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు

**నర్సాపూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మేజర్ గ్రామ పంచాయతీ రుస్తుంపేటను శుక్రవారం ట్రైనీ సివిల్స్ సర్వీసెస్ బృందం ఐఆర్ఎస్ ఆఫీసర్ సోనూపార్మర్, ఐపిఎస్ అరుణ్‌కుమార్‌సింగ్, ఐఎఫ్ఓఎస్ బోస్లే అక్షయ్‌దినకర్, ఐఎఫ్ఎస్ మనీషా కాన్సల్, ఐపిఎస్ కె.ఎం.ప్రియాంక సందర్శించారు. వారు గ్రామంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామంలోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు సందర్శించడం జరిగింది. అనంతరం గ్రామ పంచాయతీని సందర్శించి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామం చిత్రపటాన్ని వేసి ఎక్కడ ఏం ఉన్నాయో తెలుపుకున్నారు. అలాగే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయో గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు ఏడుపాయల వనదుర్గా మాతా ఆలయానికి వెళ్లడం జరిగింది. కార్యక్రమంలో ఎంపిడివో మధులత, మాజీ సర్పంచ్ విజయభాస్కర్‌రాజు ప్రభుత్వ అధికారులు గ్రామస్థులు పాల్గొన్నారు.

### ఉద్యోగులు సమయ పాలన పాటించాలి

**తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్**



వైద్యులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

**నర్సాపూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ప్రభుత్వాసుపత్రిలో ప్రజలకు మెరుగైన ఆరోగ్యసేవలు అందించాలని తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ అన్నారు శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని, కౌడిపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని డాక్టర్ అజయ్‌కుమార్ అకస్మికంగా తనఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సాపూర్‌లోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని రోగులతో మాట్లాడుతూ మీకు డాక్టర్ల వైద్య సేవలు ఎలా అందుతున్నాయి? సమయానికి మందులు ఇస్తున్నారా? సిబ్బంది సమయానికి వస్తున్నారా అంటూ రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సరైన వైద్య సేవలు అందించాలపి డాక్టర్లకు, సిబ్బందికి సూచించారు. అంతేగాక ఆసుపత్రి సిబ్బంది సమయ పాలన పాటించి రోగులను నిర్లక్ష్యం చేయకుండా సమయానికి అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా సూపరింటెండెంట్ డాక్టర్ శివదాయల్, నర్సాపూర్ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పావని, డాక్టర్లు మిర్జానజీమ్ బేగ్, రాజేశ్‌కుమార్, వంశీ, ఆసుపత్రి సిబ్బంది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

### జనావాసాల మధ్య పటాకుల దుకాణాలు

**ప్రమాదాలు జరిగితే బాధ్యులు ఎవరు ?**

**గజ్వేల్, అక్టోబరు 25 (ప్రభాతవార్త):** ప్రతి సంవత్సరం దీపావళి పండుగను పురస్కరించుకొని గజ్వేల్‌లోని సంతోషిమాత ఆలయం పక్కన నాలుగు రోజుల ముందునుంచే పటాకుల విక్రయాలకు షెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి సౌకర్యాలు లేకుండా దుకాణాలను ఏర్పాటు చేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తూ నామమాత్రపు అనుమతులు ఇచ్చి పటాకుల విక్రయదారులకు అండగా నిలుస్తున్నారు. గజ్వేల్‌లోని సంతోషిమాత ఆలయం పక్కన 12 షెడ్లకు దుకాణాలు ఏర్పాటు చేశారు. పటాకుల షెడ్లకు సమీపంలో టీటైమ్, ఐఓసి బిల్డింగ్, ఇతరత్రా దుకాణాలు ఉన్నప్పటికీ పటాకుల దుకాణాలకు ఫైర్‌సేఫ్టీ అధికారులు, మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వడం ఏమిటని ప్రజలు వాపోతున్నారు. దీపావళి పండుగకు నాలుగు రోజుల ముందే పటాకులను విక్రయించడంతో చుట్టుపక్కల వారు అనుకోకుండా ఏమైనా ప్రమాదం జరుగుతుందో అని భయపడుతున్నారు. అనుకోని సంఘటనలు జరిగితే అధికారులు బాధ్యత వహిస్తారా, పటాకుల దుకాణదారులు బాధ్యత వహిస్తారో అని వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ఫైర్ సేఫ్టీ అధికారులు పట్టణ శివారులో పటాకుల విక్రయాలకు షెడ్లను ఏర్పాటు చేసుకున్న తర్వాత అనుమతులు ఇస్తే బాగుంటుందని పలువురు కోరుతున్నారు.



పటాకుల విక్రయాలకు ఏర్పాటుచేసిన షెడ్లు

**కుటుంబంలో చిచ్చు పెట్టిన వీడియో కాల్**

# వివాహిత ఆత్మహత్య

**అమీన్‌పూర్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** కుటుంబంలో వీడియో కాల్ చిచ్చు పెట్టింది. సాయిచరణ్ అనే వ్యక్తికి వివాహిత వీడియో కాల్ చేసి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. తరచూ వీడియో కాల్ చేస్తూ వేధింపులకు గురిచేసినందుకు కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి రాజేశ్వరి అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... మహబూబ్‌నగర్‌కు చెందిన సమిత, అశోక్ వివాహం జరిగింది. వీరికి రెండు సంవత్సరాల కుమారుడు. నాలుగు సంవత్సరాలుగా సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో నివాసం ఉంటున్నారు. సమిత తరచూ వీడియో కాల్ మాట్లాతుండగా భర్త సమిత తల్లిదండ్రులకు తెలిపాడు. ఈ విషయంపై తల్లిదండ్రులు కూతురిని ప్రశ్నించగా బహబూబ్‌నగర్‌కు చెందిన సాయిచరణ్‌తో వీడియో కాల్ మాట్లాడుతున్నట్లు సమిత తెలిపింది. బుధవారం సాయంత్రం సమిత సాయిచరణ్‌తో వీడియో మాట్లాడుతూ చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని కూతురుకు తరచూ వీడియో కాల్ చేస్తూ వేధిస్తున్నాడని, కూతురు కాపురం పాడుచేయొద్దని వేడుకోవడం జరిగింది. వీడియో కాల్స్ చేస్తూ వేధిస్తున్నందుకు తన కూతురు జీవితంపై విరక్తి చెంది వీడియో కాల్ ఆన్ చేసి ఉరేసుకొని చనిపోయిందని, తన కూతురు మృతికి కారణమైన సాయిచరణ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలంటూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అమీన్‌పూర్ సిఐ సదా నాగరాజు తెలిపారు.

## ప్రజలంతా తడి,పొడి చెత్తను వేరుచేసి ఆటోల్లో వేయండి



బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్‌లోని హైదర్షాకోట్‌లో చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్న కమీషనర్ శరత్‌చంద్ర.

**నార్సింగి, అక్టోబర్ 25 ప్రభాతవార్త :** ప్రజలంతా తమ ఇళ్లలోనే తడి,పొడి చెత్తను వేరు చేసి ఆటోలలో వేయాలని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కార్పోరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో, 4,5,6 డివిజన్ల పరిధిల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్‌తో కలిసి కమీషనర్ ప్రజలకు తడి,పొడి చెత్త వేరు చేయాలని అవగాహన కల్పిస్తూ బుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా తమ ఇళ్లు, ఇంటి పరిసరాలలో చెత్త, నీరు నిలువ ఉండకుండా చూడాలని తెలిపారు. చెత్త, నీరు ఉన్నచోటనే వ్యాధి కారకాలైన దోమలు, ఈగలు వ్యాప్తిచెంది మలేరియా, టైఫాయిడ్, బోధకాలు, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. పరిశుభ్రతను పాటించే వారు 90.శాతం వ్యాధులకు దూరం అవుతారన్నారు. కార్పోరేషన్ పరిధిలోని ప్రజలంతా పరిశుభ్రతను పాటించాలని కమీషనర్ శరత్‌చంద్ర సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు మల్లేష్, కృష్ణ, లక్ష్మీనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

## గృహకల్ప కాలనీకి బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

**నిజాంపేట్, అక్టోబర్ 25, ప్రభాతవార్త**

నిజాంపేట మున్సిపల్ కార్పోరేషన్ రాజీవ్ గృహకల్ప కాలనీకి టిఎస్ఆర్‌టిసి బస్సుసౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్‌రెడ్డిని గృహకల్ప కాలనీ వాసులు మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో ఎదుర్కొంటున్న బస్సు సమస్య గురించి చెప్పడం జరిగింది. వెంటనే ఆయన స్పందించి సంబంధిత డిపో మేనేజర్‌తో చరవాణి ద్వారా మాట్లాడడం జరిగింది. కాలనీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూకట్‌పల్లి డిపో మేనేజర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. రాజీవ్‌గృహకల్ప కాలనీతో పాటు పరిసరకాలనీలలో దాదాపుగా 30 వేల కుటుంబాలు నివాసం ఉన్నప్పటికీ ముఖ్యంగా విద్యార్థులు, వికలాంగులు, వృద్దులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే బస్సు కోసం కాలినడకన దాదాపు అరకిలోమీటర్ పైనే రావలసిన అవసరం ఏర్పడుతుందని తెలిపారు. కూకట్‌పల్లి డిపో మేనేజర్ హరి సానుకూలంగా స్పందించి పై అధికారులతో మాట్లాడి బస్సు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాలాల్ సేన ప్రధాన కార్యదర్శి రామచంద్రనాయక్, పలు డివిజన్‌ల అధ్యక్షులు సరళలక్ష్మణ్, పితాని శ్రీనివాసులు, సరితారెడ్డి, రాణి, సుమతి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలి

**బేగంబజార్, అక్టోబర్ 25 ప్రభాతవార్త:**

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించాలంటే వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులను చెల్లించాలని ట్రాన్స్‌కో బేగం బజార్ డివిజనల్ ఇంజనీర్‌గాపదవి భాద్యతలు చేపట్టిన మహ్మద్ పర్వాత్ అలీ తెలిపారు. డిఇ గా కొనసాగిన నెహ్రు బదిలీ కావడం తో ఆయన స్థానంలో డి.ఇ టెక్నికల్‌గా కొనసాగిన పర్వాత్‌అలీ బేగంబజార్ డిఇగా బదిలీపై వచ్చారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ బేగంబజార్, సీతారాంపేట్, ట్రూప్‌బజార్ ఎడిఇ పరుధుల్లోని 9తొమ్మిది సెక్షన్లలోని ట్రూప్‌బజార్, పుత్లీబౌలి, సుల్తాన్‌బజార్, కార్వాన్, దత్తాత్రేయనగర్, సీతారాంబాగ్, ఫీల్‌ఖానా, చుడీబజార్, సీతారాంపేట్ సెక్షన్ల పరుధులోని వినియోగదారులు సకాలంలో తమ విద్యుత్ బిల్లులతోపాటు బకాయిలను చెల్లించాల ని కోరారు. విద్యుత్ పరంగా ఎలాంటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా దీపావళి పండుగను పురస్కరించుకుని వ్యాపారులకు, గృహ విద్యుత్ వినియోగదారులకు మెరుగైనసేవలు అందించేందుకుగాను ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రహదారులల్లో అడ్డదిడ్డంగా ఉన్నవిద్యుత్ వైర్లను కూడా సరి చేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులతోపాటు తమ బకాయి బిల్లులను కూడా చెల్లించాలని డి.ఇ మహ్మద్ పర్వాత్‌అలీ కోరారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను కళా గురువులందరికీ అందేలా కృషి చేయాలి

**-కళాబంధు డాక్టర్ అనూహ్యారెడ్డి**



ప్రసంగిస్తున్న కళాబంధు, సేవారత్న, సిటీ, టీవీ సీరియల్ నిర్మాత డాక్టర్ జి.అనూహ్యారెడ్డి

**చిక్కడపల్లి, అక్టోబరు 25 ప్రభాతవార్త:**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను కళా గురువులందరికీ అందేలా కృషి చేయాలని కళాబంధు, సేవారత్న, సిటీ, టీవీ సీరియల్ నిర్మాత డాక్టర్ జి.అనూహ్యారెడ్డి అన్నారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో చినుకు కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, కవి, విశ్లేషకులు పిఎన్.మూర్తి అధ్యక్షతన కళాగురువుల సమావేశం జరిగింది. డాక్టర్ అనూహ్యారెడ్డి మాట్లాడుతూ ఆరవై ఏళ్ళు దాటిన వృద్దాప్య కళాకారులందరికీ పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని కళావేదికలను గుర్తింపు కలిగిన కళా సంస్థలకు వారి ప్రదర్శనలకు ఉచితంగా ఇవ్వాలని, ప్రతి జిల్లాల్లో కళావేదికలను నిర్మించాలని, కళాగురవులకు ప్రతి నెల రూ.15వేల పారితోషికం ఇవ్వాలని, సంగీత, నృత్యకళలలో ఉచితంగా శిక్షణ ఇప్పించాలని సమావేశం తీర్మానించింది. త్వరలోనే కళాకారుల శోభాయాత్ర నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీర్మాణాలను అందించాలని నిర్ణయించింది. కార్యక్రమంలో బిల్డప్‌షాట్ సిఈఓ నవీన్ కృష్ణ గోసల, తెలుగువెలుగు వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి, సినీ నిర్మాత శ్రీరామ్‌దత్తి తదితరులు పాల్గొన్నారు.

## వినిపించే పాటకు కనిపించని మహా కవి గోపి : బుద్ధప్రసాద్



గానకోకిల శారదను సత్కరిస్తున్న బుద్ధప్రసాద్, నరసింహారావు, సుచిత్ర, వంశీరామరాజు తదితర అతిథులు

**రవీంద్రభారతి, అక్టోబరు 25 ప్రభాతవార్త :** వినిపించే పాటకు కనిపించని సినీసాహిత్య రంగంలో మహనీయ కవి మైలవరపు గోపి అని ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ అన్నారు. రాముడు పుట్టిన దేశం, రఘురాముడు ఏలిన రాజ్యం; ప్రజలకు శాంతి సౌఖ్యం కలిగించే దేశమేదేశం; బాసినభావం విడనాడి ఏజాతి నిలుచునే అది జాతి; ఇదిగో దేవుడు చేసిన బొమ్మ వంటి ఎన్నో పాటలతో గొప్పభావన వ్యక్తం చేశారని, సినీసాహిత్యానికి కావ్యగౌరవం కలిగించిన మహోన్నతవ్యక్తి అని కొనియాడారు. తెలుగు సినీగేయానికి జాతీయ అవార్డులతోనే ఆనంద పడుతున్న మనకు అంతర్జాతీయస్థాయిలో ఆస్కార్ అవార్డు రావడం భారతదేశ, తెలుగురాష్ట్రాలకే గర్వకారణమన్నారు. అలాంటి సినీగేత రచయితకు మనసా కవ్వించకే నన్నిలా.. శీర్షికన సంగీత విభావరితో స్వరనీరాజనం కావించి శారద ఆకునూరిని వివిధ సేవలను ఎంతగానో అభినందించారు. సత్కారాలే కాక సత్కార్యాలు నిర్వహించే వ్యక్తి వంశీరామరాజు అని ఆయన సేవలను కొనియాడారు. వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, శారద ఆకునూరి అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో ప్రఖ్యాత సినీగేయ రచయిత మైలవరపు గోపికి రవీంద్రభారతి ప్రధాన మందిరంలో మనసా కవ్వించకే నన్నిలా.... శీర్షికన సంగీత విభావరితో ప్రముఖ గాయని ఆకునూరి శారద, బృందం సమర్పణలో ఆణిముత్యాల్లాంటి అలనాటి సినీగీతాలను వర్ధమాన గాయకులు సుమధురంగా ఆలపించి స్వరనీరాజనం కావించి సంగీతప్రియులకు వీనులవిందు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండలి బుద్ధప్రసాద్, విశిష్ట అతిథులుగా రేలంగి నరసింహారావు, సుచిత్ర చంద్రబోస్, మైలవరపు వెంకన్న, వంశీ సంస్థల అధినేత కళాబ్రహ్మ శిరోమణి వంశీరామరాజు, అనంత్, శైలజ తదితరులు పాల్గొని ప్రసంగించి గానకోకిల శారద ఆకునూరిని ఘనం గా సత్కరించి ఎంతగానో అభినందించారు. రామరాజు స్వాగతోపన్యాసంలో వంశీ సంస్థ ప్రస్థానాన్ని సవివరపరిచారు.

## సిఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**: ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**



సిఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసి లేటర్‌ను లబ్దిదారులకు అందజేస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, అక్టోబరు 25 ప్రభాతవార్త**

సిఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఖాజా అహ్మదుద్దీన్ అహ్మద్ వైద్య చికిత్స కోసం లక్ష రూపాయల సిఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసి లేటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి కుటుంబాలు ఖరీదైన వైద్యం పొందేందుకు సిఎంఆర్‌ఎఫ్ ఉపయోగపడుతుందన్నారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులు సిఎంఆర్‌ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు.

## మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలో పర్యటించిన కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలో పర్యటిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే,కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,అక్టోబరు 25 ప్రభాతవార్త :**

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలో శుక్రవారం హోలియా దాసరి సంఘం కమిటి ప్రతినిధులతో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే,కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పాదయాత్ర నిర్వహించారు. కొత్త కమ్యూనిటీ హాల్ కోసం జిహెచ్ఎంసి అధికారులతో ఆయన చర్చించారు. కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్బంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏఈ నరసింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, కిరణ్, దేవులపల్లి దాసు, తలారి చిన్న, శ్రీ కాంత్ రెడ్డి, దాసు, గణేష్ ముదిరాజ్, కిషన్, శంకర్, నిహాల్ యాదవ్, పాండు యాదవ్, అమర్, రమేష్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ కార్యక్రమానికి ప్రజలు సహకారాన్ని అందించాలి

**- చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్న**




సమావేశంలో పాల్గొన్న చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న, డిఎంసిలు, అధికారులు

**చార్మినార్, అక్టోబరు 25 ప్రభాతవార్త :**

హైదరాబాద్ నగరాన్ని చెత్త రహిత ప్రాంతంగా మార్చేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమానికి ప్రజలు తమ పూర్తి సహకారాన్ని అందించాలని జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న కోరారు. పాతబస్తీ చాంద్రాయణగుట్ట నర్కిపూల్ బాగ్‌లోని జోనల్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ 2024 కార్యక్రమంపై జోనల్ కమిషనర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిహెచ్ఎంసి స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ యశస్విని సమావేశంలో స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంపై ప్రెజేంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా జోనల్ కమిషనర్ వెంకన్న మాట్లాడుతూ హైదరాబాద్ మహానగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. ప్రతీ రోజు పర్యటిస్తూ పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట్, సంతోష్‌నగర్, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లు జయంత్, శైలజ, సురేందర్, సరిత, అరుణ కుమారి, రవి కుమార్, డిసి శంకర్ సింగ్, ఎంఎహెచ్‌వోలు, శానిటరీ సూపర్ వైజర్లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## హ్యాండ్‌బాల్ విజేతలు జనప్రియ, ఆర్మీ పబ్లిక్ స్కూల్

**-ఎస్ఎఫ్ఎ ఛాంపియన్‌షిప్ పోటీలు**



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**హైదరాబాద్, అక్టోబరు 25,ప్రభాతవార్త:**

ఎస్ఎఫ్ఎ ఛాంపియన్‌షిప్ 2024 ఎడిషన్‌లో 11వ రోజు ఉత్కంఠభరితంగా కొనసాగింది. గచ్చిబౌలి స్టేడియంలో శుక్రవారం జరిగిన బాలుర అండర్ 10 హ్యాండ్‌బాల్‌ఫైనల్‌లో విజ్ఞాన్‌జ్యోతి స్కూల్‌పై విజయం సాధించి జనప్రియ స్కూల్ ట్రోఫీ కైవసం చేసుకుంది. బొల్లారం ఆర్మీ పబ్లిక్ స్కూల్ జట్టు బాలిక అండర్ 14 వాలీబాల్ ఫైనల్లో విజ్ఞాన్స్‌బోధి స్కూల్‌ను ఓడించింది స్వర్ణం గెలిచింది. దిక్రిక్‌ప్లానెట్ స్కూల్ విద్యార్థులు స్విమ్మింగ్‌లో అద్భుతమైన ప్రదర్శన చూపెట్టారు. హర్షిత వర్మ భూపతి రాజు, తేజరామ్ సామినేని వరుసగా అండర్ 16బాలికల, బాలుర 100మీటర్ల బటర్‌ఫ్లైస్ట్రోక్‌లో విజేతలుగా నిలిచారు. బాస్కెట్‌బాల్‌లో బాలికల అండర్ 14 ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్‌లో బాలుర అండర్ 16, అండర్ 18 సెమీ ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠంగా సాగి తుదిదశకు చేరుకున్నాయి. కోట్లవిజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో అండర్ 17 బాలి కల కబడ్డీ పోటీలు సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ప్రస్తుతం నిజాంపేట్‌కు చెందిన విజ్ఞాన్‌బోధి స్కూల్ తమ పతక పరంపర కొనసాగిస్తూ అగ్రస్థానాన్ని నిలుపుకుంది. ఈఏడాది హైదరాబాద్ ఎడిషన్ ఎస్ఎఫ్ఎ ఛాంపియన్‌షిప్‌లో 920 పాఠశాల నుంచి 23వేలమంది విద్యార్థులకు 22 క్రీడా విభాగాల్లో పోటీపడుతుండగా ఈనెల 28వరకు పోటీలు జరగనున్నాయి.

## డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మి అభినందనీయురాలు

**-ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి**



డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మిలను సత్కరిస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి

**చిక్కడపల్లి, అక్టోబరు 25 ప్రభాతవార్త:**

కవయిత్రిగా, రచయిత్రిగా ఇప్పటికీ సాహితీసేవ చేస్తున్న డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మి అభినందనీయురాలని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. సాహితీ జిగీష సాహితీ సాంస్కృతిక సంస్థ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా సాహితీ జిగీష వ్యవస్థాపకులు డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మి సహస్రపూర్ణ చంద్ర దర్శనోత్సవం సభ శుక్రవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాలలిత కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కెవి.రమణాచారి డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించి అభినందించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ సభలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి, సాహితీ జిగీష వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ లలితవాణి, అధ్యక్ష, ఉపాధ్యక్షులు బండారుపల్లి రామచంద్రరావు, రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'ప్రహ్లాదచరిత్ర' అంశంపై 'సాహితీ ప్రభాస' ఎం.దత్తాత్రేయ శర్మ, శ్రీకృష్ణకుచేల అంశంపై ఆచార్య టి.పతంజలి, 'గజేంద్ర మోక్షం' అంశంపై ఆచార్య పివి.ఉమా శశి ప్రసంగించారు.

## పోలీసునంటూ ఆటో డ్రైవర్ లూటీ



పోలీసులు అదుపులో స్యూడో పోలీసు

**అల్వాల్, అక్టోబరు 25 ప్రభాతవార్త:** ఆటో డ్రైవర్‌ను సూడో పోలీసు లూటీ చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రెండు రోజులు క్రితం జరిగిన ఘటనలో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. రెండు రోజులు క్రితం అర్ధరాత్రి ఆటో డ్రైవర్ నవీన్ నాయక్ ఇంటికి వెళుతుండగా కానాజీగూడా వద్ద ఓ వ్యక్తి అటకాయించి ఆటోను ఆపాడు. పోలీసు అని పేర్కొన్న అతను ఆటో డాక్యుమెంట్స్ ఎక్కడ అని ప్రశ్నించడంతో పాటుగా డ్రస్ ఎందుకు వేసుకోలేదన్నాడు. బాధితుడు సమాధానం చెప్పేలోపు అతనిపై దాడి చేసి జేబులో ఉన్న 22వేలు నగదు దోచుకున్నాడు. ఆటో డ్రైవర్ అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరపగా వెంకటాపురంకు చెందిన నరేష్ సూత్రదారిగా గుర్తించారు. నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. రెండు వేలు నగదుతో పాటుగా ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే

**-టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు సాయిబాబా**

**-జిల్లా కార్యాలయంలో పార్టీ సభ్యత్వ నమోదు పోస్టర్ ఆవిష్కరణ**



సభ్యత్వ నమోదు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా

**ముషీరాబాద్, అక్టోబర్ 25, ప్రభాతవార్త:**

హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా స్పష్టం చేశారు. శుక్రవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమ పోస్టర్‌ను టీడీపీ నాయకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ 1982లో ముషీరాబాద్‌లోని రామకృష్ణ స్టూడియోలో తెలుగుదేశం పార్టీ స్థాపన జరిగిందని, ఆనాటి నుండి పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా ప్రజల పక్షాన నిలబడి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని గుర్తు చేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చేపట్టిన కార్యక్రమాల వల్లనే మూడు సార్లు క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా హైదరాబాద్‌కు అవార్డులు అందాయని అన్నారు. నేడు హైదరాబాద్ 20 నుండి 30 లక్షల మందికి ప్రత్యక్షంగా ఉపాధి పొందటానికి కారణం ఆనాడు చంద్రబాబు నాయుడు ముందుచూపుతో హైటెక్ సిటీని రూపొందించటమేనని తెలిపారు. తెలంగాణ సుభిక్షంగా ఉండటానికి కారణం చంద్రబాబు నాయుడేనని, టీడీపీ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి ప్రజల్లోకి తీసుకువెళ్లి, తెలుగుదేశం పార్టీలోకి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరతామని అన్నారు. తెలుగుదేశం పిలుస్తోంది రా, కదలిరా అనే నినాదంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుకుగా చేయాలని కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, శ్రీపతి సతీష్, ఎం.కే.బోసు, ఎం.రాజు, గౌరీ శంకర్‌యాదవ్, కట్ట రాములు, భవాని శ్రీనివాస్, ఎ.బి.ఆర్.మోహన్, జాకబ్, బాల నర్సింలు, భానుప్రకాష్, కిరణ్, మేడిపల్లి శ్యాంసుందర్, పి.వారబాబు, విఠల్, బి.రాజు, మహిళా నాయకులు శశిరేఖ తదితరులు పాల్గొన్నారు.

## పద్యనాటక కళాకారుల కృషే నాటకాలకు రాణింపు

**-విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతీశర్మ**



శ్రీకృష్ణరాయబారం పౌరాణిక పద్యనాటకంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, అక్టోబరు 25 ప్రభాతవార్త :**

ప్రతీఒక్క పద్యనాటక కళాకారుడి ఆయా పాత్రల్లో నటనా వైభవం, కృషే ఆ నాటకం రక్తికట్టి రాణించడానికి కారణమని విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతీశర్మ అన్నారు. గ్రామీణ శ్రామికులకు, ప్రజలకు పౌరాణిక పద్యనాటకాలపట్ల మక్కువ ఎక్కువని, గొప్పగా ఆదరిస్తారని, వారికి చదువు రాకపోయినా వచ్చిన వారితో పద్యాలను కంఠస్థం చేసి నాటకప్రదర్శనలు ఉత్సాహంగా ప్రదర్శించేవారని జవహర్ బాలభవన్ పూర్వ డైరెక్టర్ రసమయి డా. ఎం.కె.రాము అధ్యక్షోపన్యాసంలో అన్నారు. సాంఘిక నాటకాలు వేయడం సులువు అభినయం వస్తేచాలని, కానీ పద్యనాటకాలు చాలా కష్టమని, ఆయా రాగాలు, వాటి వాడకం తెలియాలని చెప్పారు. పౌరాణిక పద్యనాటకాల్లో హార్మోనియం చాలా ముఖ్యమని అదిలేకపోతే రక్తికట్టదు రాణించదని, ప్రతీ సన్నివేశాన్ని కళ్లకుకట్టినట్లు చేయడం హార్మోనియం కళాకారుడితేనని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కల్పనా కళానికేతన్ ఆధ్వర్యంలో రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకొని డా. ఎం.కె.రాము సభాధ్యక్షతన గురుపంచక వందన పౌరాణిక పద్యనాటకోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నాగమారుతీశర్మ, విశిష్ట అతిథులుగా భార్గవశర్మ, నాగభూషణం, శ్రీనివాసరావు, డా. పులిగడ్డ హనుమంతరాయశర్మ, సంస్థ అధ్యక్షుడు దొంతి జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొని నేటి సాంస్కృతిక కార్యక్రమాల్లో జంగయ్యగౌడ్ నిర్వహణలో శ్రీకృష్ణరాయబారం (శయనదృశ్యం) పద్యనాటకం, హనుమంతరాయశర్మ హనుమంతుడి భక్తిగీతాలు, గడ్డంలాలయ్య ఆధ్వర్యంలో సినీసంగీత విభావరిలో పాల్గొన్న కళాకారులతోపాటు కళాకారులు ఎం.భాస్కర్‌రావు, బి.పరమేశ్వర్, ఎం.రమణాచారిలను ఘనంగా సత్కరించారు.

## పూల వ్యాపారులకు ట్రాఫిక్‌పై అవగాహన



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ట్రాఫిక్ ఏసీపీ డి.ధనలక్ష్మి,

**మెహిదీపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :**

దీపావళి పండుగను పురస్కరించుకొని గుడిమల్కాపూర్ పి.ఇంద్రారెడ్డి పూల మార్కెట్‌లోని వ్యాపారులకు శుక్రవారం మార్కెట్ సెక్రటరీ శ్రీనివాస్ నాయక్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సౌత్ వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ డి.ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ అంజయ్యలు ముఖ్య అతిథులుగా హాజరై వ్యాపారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించడంతో పాటు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డి.ధనలక్ష్మి మాట్లాడుతూ..గుడిమల్కాపూర్‌లో కూరగాయల, పూల మార్కెట్‌లు ఉండడంతో మార్కెట్ రహదారులన్ని రద్దీగా మారుతుండడంతో పాటు పండుగల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తెలుత్తుతున్నాయని, వాటిని ట్రాఫిక్ అధికారులు, రైతులు, వ్యాపారులు సమన్వయంతో పనిచేస్తేనే పరిష్కారం అవుతాయన్నారు. మార్కెట్‌లోకి ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలను తీసుకొని రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. దీపావళి పండుగ సమయంలో మూడు రోజుల పాటు ద్విచక్ర వాహనాలతో పాటు కార్లను మార్కెట్‌లోకి తీసుకురావద్దని వ్యాపారులకు సూచించారు. కేవలం రైతులు, కరీదుదారుల వాహనాలను మాత్రమే మార్కెట్‌లోకి అనుమతిస్తామన్నారు. మార్కెట్ బయట వాహనాలను పార్కింగ్ చేసి వస్తే మార్కెట్‌లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తవన్నారు. పూలమార్కెట్ మొత్తంలో 200 వ్యాపాల సముదాయాలు, అందులో పనిచేసే వారితో కలిపితే మొత్తం 2వేలకు పైగా వాహనాలు అవుతున్నాయని వాటిని మార్కెట్‌లోకి తీసుకరావద్దన్నారు. వ్యాపారులందరు బాధ్యతగా వ్యవహరిస్తూ అధికారులకు సహకరించాలని కోరారు. సమావేశంలో మార్కెట్ అధికారులతో పాటు పూలవ్యాపారులు పాల్గొన్నారు.

## 'జస్టిస్ కెజి.బాలకృష్ణన్ కమిషన్' అంశంపై ప్రత్యేక సమావేశం



కార్యక్రమంలో పాల్గొన్న గోనె సాల్మన్ రాజ్, బ్రదర్ జోస్ డేనియల్, విశ్రాంత ఐపీఎస్ అధికారి బాబురావు, బిషప్ వీరాజి పంటా ఇజ్రాయెల్, స్లీవా గలెలి, క్రిస్టోఫర్ జోసెఫ్

**చిక్కడపల్లి, అక్టోబరు 25 ప్రభాతవార్త:**

ఆల్ ఇండియా యునైటెడ్ క్రిస్టియన్ మూవ్‌మెంట్ ఫర్ ఈక్వల్ రైట్స్(ఎఐయసిఎంఈఆర్) ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని 26న నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ ప్రతినిధి గోనె సాల్మన్‌రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం ఆర్టీసిక్రాస్ రోడ్స్‌లోని సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా గోనె సాల్మన్‌రాజ్ మాట్లాడుతూ 26న నగరంలోని సెకింద్రాబాద్ సెయింట్ పెట్రిక్స్ హైస్కూల్ ఆడిటోరియంలో జరిగే ఈ సమావేశంలో ఆలిండియా దళిత క్రిస్టియన్ డిమాండ్ కోరుతూ 'జస్టిస్ కెజి.బాలకృష్ణన్ కమిషన్' అంశంపై ప్రత్యేక సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. ఆ రోజు సాయంత్రం మూడు గంటల నుంచి ఆరు గంటలకు జరిగే ఈ సమావేశంలో క్రైస్తవ సంస్థల సహకారంతో తెలంగాణ యూనైటెడ్ క్రిస్టియన్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్, నేషనల్ దళిత క్రిస్టియన్ బిషప్స్ కౌన్సిల్, ఫెడరేషన్ ఆఫ్ తెలుగు చర్చస్, ఇతర క్రైస్తవ సంస్థలు ఈ సమావేశంలో పాల్గొనబోతున్నాయన్నారు. ఈ సందర్భంగా జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బ్రదర్ జోస్ డేనియల్, విశ్రాంత ఐపీఎస్ అధికారి బాబురావు, బిషప్ వీరాజి పంటా ఇజ్రాయెల్, స్లీవా గలెలి, క్రిస్టోఫర్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేట విమానాశ్రయంలో ఎయిర్ క్రాఫ్ట్ ఇంజన్ భాగం ధ్వంసం

**-గుర్తు తెలియని వ్యక్తులు పై కేసు నమోదు**

**బేగంపేట అక్టోబరు 25,ప్రభాతవార్త**

బేగంపేట విమానాశ్రయంలో పార్క్ చేసిన అపోలో యాజమాన్యానికి చెందిన ఎయిర్ క్రాఫ్ట్ ఇంజన్ ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటనపై బేగంపేట పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదైంది. ఇన్స్‌పెక్టర్ సీహెచ్ రామయ్య కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అపోలో ఆస్పత్రుల యాజమాన్యానికి చెందిన ఎయిర్ క్రాఫ్ట్ విటీ పీసీఆర్ ను బేగంపేట విమానాశ్రయంలో పార్క్ చేసి అక్కడి నుంచి రాక పోకలు సాగిస్తుంటారు. ఈ ఏడాది ఏప్రిల్ 5న విమానంలో సంబంధిత వ్యక్తులు చెన్నై వెళ్లేందుకు పరిశీలించారు. ఈ సమయంలో ఇంజన్ భాగంలో కొన్ని పరికరాలు స్వల్పంగా దెబ్బతిని ఉన్నట్లు గుర్తించారు. అయితే అప్పటికే విమానం టేకాఫ్ కు అనుమతి రావడంతో విమానం బేగంపేట నుంచి చెన్నైకు బయలుదేరి వెళ్లింది. చెన్నై విమానాశ్రయంలో ల్యాండింగ్ సమయంలో విమానం ఇంజిన్‌లోని కొన్ని లోపాలను గుర్తించారు. చెన్నై చేరిన తర్వాత పరిశీలిస్తే ఇంజిన్ భాగంలో మరికొన్ని పరికరాలు ధ్వంసమై కనిపించాయి. దీంతో గురువారం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఈ మేరకు బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అధిక శబ్ధ సైరన్ల వాహనదార్లపై కేసులు నమోదు



నిబంధనలు ఉల్లఘించిన వాహనదారుపై కేసు నమోదు చేస్తున్న ఎస్ఐ మహేష్, సిబ్బంది

**నాంపల్లి, అక్టోబరు 25 ప్రభాతవార్త :**

నాంపల్లి ట్రాఫిక్ పోలీసులు తమ పైఅధికారుల ఉత్తర్వుల ప్రకారం శుక్రవారం నాంపల్లి ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా వ్యతిరేకంగా వాహనాకులు అధికశబ్ధంతో కూడిన సైరన్లను వాడిన వాహనదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకున్నారు. నాంపల్లి ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఆధ్వర్యంలో ఆయా వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించి, వాహనాలలో పరిమితిమించి శబ్ధం కలిగిన వాహనాల మరియు ఎయిర్ హారన్ వినియోగిస్తున్న వాహనదారులు 15మందిపై కేసులను నమోదు చేశారు. ఈ సందర్భంగా నాంపల్లి ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ అత్యవసర వాహనాలైన అంబులెన్స్, ఫైర్ ఇంజన్, పోలీసు, మోటార్ వాహనాల విభాగం అధికారులు మినహా ఎయిర్ హార్న్, సైరన్లను ఉపయోగించడం చట్టరీత్యా నిషిద్ధమన్నారు. నిబంధనలను పాటించని వాహనదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో నాంపల్లి ట్రాఫిక్ ఎస్ఐ ఎం.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ బాదె చంద్రం

## కోమటిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**రామాయంపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త :** రామాయంపేట సహకార సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంఘం చైర్మన్ బాదె చంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విధానాల ప్రకారం రైతులు ధాన్యాన్ని తీసుకువాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దళారులను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్ పోచమ్మల ఐలయ్య, మున్సిపల్ కౌన్సిలర్‌లు దేమె యాదగిరి, సుందర్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సుప్రభాతరావు, రమేష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**చిన్నకోడూరు, అక్టోబరు 25, ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధర పొందాలని ఏపీఎం అంజనేయులు అన్నారు. మండలపరిధిలోని గోనెపల్లి, మాచాపూర్, గంగాపూర్, ఇబ్రహీంనగర్, చిన్నకోడూరు గ్రామాల్లో శుక్రవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతి నిధులు, గాజుల బాబు, పన్యాల లింగారెడ్డి, స్వరూప ఎల్లాగౌడ్, నెమలి సుభాష్, బండి మల్లేశం, బత్తుల మల్లేశం, జంగిటి బాలరాజు, ఎల్లయ్య, సుంచు ఎల్లయ్య, ఏలేటి నరసింహరెడ్డి, వెలుగు సీసీలు బాలరాజు, రాజ్‌కుమార్, కొమురయ్య, సీఎలు లింగవ్వ, జ్యోతి, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు తెలుపుతున్న ఎస్ఐ అభిలాష్

**కోహెడ, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని శనిగరం, చంచల్ చెరువుపల్లి, కూరెళ్ల, నాగసముద్రాల, చిగురుమామిడి మండలం నవాబుపేట, కొండాపూర్, గన్నేరువరం మండలాల్లోని వివిధ దేవాలయాల్లో దొంగతనం ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు ఎస్ఐ అభిలాష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కోహెడ బస్టాండు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా టివిఎస్ ఎక్సెల్‌పై కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆయా మండలాల్లోని వివిధ దేవాలయాల్లో దొంగతనాలు చేసినట్లు అంగీకరించినట్లు తెలిపినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

## కాంగ్రెస్ నుంచి బిజెపిలోకి చేరికలు



బిజెపిలో చేరుతున్న కాంగ్రెస్ నేతలు

**కోహెడ, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తంగళ్లపల్లి గ్రామానికిచెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ కోశాధికారి వడ్లకొండ చంద్రం మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి సమక్షంలో శుక్రవారం ఆ పార్టీకి రాజీనామా చేసి బిజెపిలో చేరారు. బిజెపిలో చేరిన చంద్రంకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, ఖమ్మం వెంకటేశం, పిల్లి నర్సయ్య, ఎర్రవెల్లి హరిదాస్, బోయిని యాదయ్య, జోగు చందు, పిల్లి ప్రకాష్, నాగవెల్లి వెంకటేష్, బుర్ర రమేష్ ఉన్నారు.

## రెడ్డి ఐక్యవేదిక యూత్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సదానందరెడ్డి



నియామకం పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

**మిరుదొడ్డి, అక్టోబరు 25, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన రెడ్డి ఐక్యవేదిక సమావేశంలో మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన లింగాల సదానందరెడ్డిని జిల్లా రెడ్డి ఐక్యవేదిక యూత్ ఉపాధ్యక్షులుగా నియమించారు. ఈ సందర్భంగా నియామకం పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఏనుగుల సంతోష్‌రెడ్డి, రాష్ట్ర యూత్ అధ్యక్షులు సుమన్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు కొండి రాజిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చంద్రసేనగుప్తాకు ఘన నివాళులు

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం వాసవీ, వాసవీ వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో వాసవీ క్లబ్స్ జాతీయ వ్యవస్థాపకులు స్వర్గీయ కల్వకుంట్ల చంద్రసేన గుప్తా వర్ధంతి వేడులకను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైశ్య భవన్ వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీ సంతోషిమాత దేవాలయం, గడిమైసమ్మ దేవాలయం వద్ద యాచకులకు వాసవీక్లబ్ జాతీయ ఉపాధ్యక్షులు మల్టీపుల్ గంప శ్రీనివాస్ చేతుల మీదుగా బియ్యం, కిరాణా సరుకులు పంపిణీ చేవారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1961లో కేసీ గుప్తా కొద్ది మందితో ప్రారంభించిన వాసవీక్లబ్ నేడు లక్ష మందికి పైగా సభ్యులు ఉన్నారని తెలిపారు. సిద్దిపేట వాసవీక్లబ్, వనిత క్లబ్‌లు పేదల కోసం ఎన్నో సేవ కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారని తెలిపారు. భవిష్యత్‌లో ఇలాగే సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఐపిసి నేతి వేణుకుమార్, ప్రతినిధులు పుల్లూరు శ్రీనివాస్, మంకాల శ్రీనివాస్, చింత రాజేంద్రప్రసాద్, మర్యాల వాణి, ఉమారాణి, రామేశ్వరి, మంజుల, శంకరయ్య, దామోదర్, శ్రీనివాస్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.



వాసవీక్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు చంద్రసేన గుప్తాకు నివాళులర్పిస్తున్న దృశ్యం

# దళితుల సంక్షేమం పట్టని కెసిఆర్

### ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్



మాట్లాడుతున్న ప్రీతమ్

**గజ్వేల్, అక్టోబరు 25 (ప్రభాతవార్త):** దళితుల, దళిత విద్యార్థుల సంక్షేమం పట్టని కెసిఆర్ పది సంవత్సరాలు కేవలం ఫాంహౌజ్‌కు పరిమితం కాగా అభివృద్ధి పేరిట గజ్వేల్‌లో విధ్వంసం సృష్టించినట్లు ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ప్రీతమ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి గజ్వేల్ పట్టణంలోని జిఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను తనిఖీచేసి అక్కడ ఉన్న విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసి రాత్రి అక్కడే బస చేశారు. శుక్రవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డితో కలిసి విద్యార్థుల సమస్యలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీతమ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను చూస్తే కళ్ల నుండి నీరు వచ్చిందని, ఎన్నో ఆశలతో దళిత విద్యార్థులు చదువుకోవడానికి వస్తే కనీస సౌకర్యాలు లేకపోవడం బాధాకరమన్నారు. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రశేఖర్‌రావు పాలిటెక్నిక్ కళాశాల సమస్యలను పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. పాలిటెక్నిక్ ఆవరణలో పాములు వస్తున్నాయని, డ్రైనేజీ వ్యవస్థ, బాత్రూమ్‌లు పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో కెసిఆర్ కుటుంబం మినహా ఏ పేద కుటుంబం ఆర్థికంగా బలపడలేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు రాష్ట్రాన్ని అప్పగిస్తే రూ.6 లక్షల కోట్ల అప్పులను మిగిల్చిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. పంజాగుట్ట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టిస్తే డంపయార్డులో వేసిన ఘనత గత పాలకులదన్నారు. దళిత వ్యతిరేకి కెసిఆర్ అన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలను సృష్టించడమే లక్ష్యంగా కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావులు కుట్ర పన్నుతున్నారన్నారు. ప్రజలు వారి కుట్రపూరిత చర్యలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థిగా తాను అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, 30 రోజుల్లోనే పాలిటెక్నిక్ కళాశాల రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తూంకుంట నర్సా రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం ఎంతగానో అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటూ పది సంవత్సరాలు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు కాలయాపన చేశారన్నారు. అభివృద్ధి ఎక్కడ జరిగింది, ఏమి జరిగింది అనేది బిఆర్ఎస్ నాయకులు చెప్పాలన్నారు. గత ప్రభుత్వంలో పాలిటెక్నిక్ కళాశాలకు ఒక్క రూపాయిని కేటాయించకపోవడం సిగ్గుచేటుకాదా అన్నారు. స్థానిక ఎమ్మెల్యేగా కెసిఆర్ ఉండి గజ్వేల్ ప్రజలకు కనబడకుండా ఉంటూ ఫాంహౌజ్‌కు పరిమితంకావడం మంచిదికాదన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గ ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ జ్యోతికృష్ణ, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, వర్గల్ మాజీ ఎంపిపి మోహన్, మైనార్టీ నాయకులు అజ్గర్, సుఖేందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, పల్లెర్ల రవీందర్‌గుప్త, జహీర్, సమీర్, డాక్టర్ వహీద్, గాడిపల్లి శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, వాసవి క్లబ్ మండల అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్, శ్రీనివాస్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం

**ఘట్‌కేసర్ రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ ప్రతాప సింగారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుండి ప్రతి గింజ కొనుగోలు చేస్తామని అన్నారు. ధాన్యం విక్రయించిన రైతాంగానికి సకాలంలో కొనుగోలు డబ్బులు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రెడ్యానాయక్, ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, డైరక్టర్ రేసు లక్ష్మారెడ్డి, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ సుగుణబాయి, వ్యవసాయ విస్తరణాధికారి మంజుల, నాయకులు బొక్కా ప్రభాకర్‌రెడ్డి, ఎ.బాల్‌రెడ్డి, మహీపాల్ రెడ్డి, రైతులు సుబాశ్, అంజయ్య, బాల పెంటయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**దోమ, అక్టోబరు 25 ప్రభాతవార్త :** గ్రామాలలోని వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని యువజన జిల్లా అధికారి ఐజయ్య అన్నారు. దోమ మండలంలోని మోత్కూర్, దిర్సంపల్లి, దోమ గ్రామ పంచాయతీ పరిధిలోని నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్‌పై అవగాహన సదస్సు యువతీ యువకులకు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన అధికారి ఐజయ్య మాట్లాడుతూ ప్రజలు తడి పొడి చెత్తను వేరు చేయాలని, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించాలని ప్రతి ఆదివారం యువత స్వచ్ఛభారత్ కార్యక్రమంలో మీ గ్రామాలను శుభ్రపరచడం కోసం ముందుకు రావాలని సోషల్ సర్వీస్‌లో పాల్గొనాలని సూచించారు. గ్రామంలోని అన్ని వీధుల్లో ప్లాస్టిక్ సేకరణ చేయడం కార్యక్రమాన్ని నిర్వహించారు. యువతీ యువకులకు మై భారత్ ఈవెంట్ డైరీ, టోపీ, పెన్నులు అందిచారు. కార్యక్రమంలో ఎంపిడివో మహేష్‌బాబు, ఎంపీఓ సోమలింగం, నెహ్రూ యువకేంద్రం అకౌంటెంట్ సాయిక్రిష్ణ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరులకు రిటైర్డ్ ఆర్మీ జవాన్ల నివాళులు

**దోమ, అక్టోబరు 25 ప్రభాతవార్త :** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో బాగంగా వికారాబాద్‌జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా ఎస్పి నారాయణరెడ్డి ఆదేశాలమేరకు ఫన్‌ర్యాలీ, 3కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వికారాబాద్‌జిల్లా రిటైర్డ్ ఆర్మీ జవాన్ల సంఘం జవాన్లుసంస్మరణ కార్యక్రమానికి మద్దతు తెలిపి పాల్గొన్నారు. నూతనంగా నియమితులైన డిఎస్‌పిలు, ఎస్ఐలుకానిస్టేబుల్‌లు ట్రెనింగ్‌లో ఉన్నవారితో, ప్రజల సహకారంతో మూడు కిలో మిటర్ల రన్నింగ్, సైకిలోంసు, 3కే రన్‌లో పాల్గొన్నారు. ఈ సందంర్భంగా వికారాబాద్‌జిల్లా ఆర్మీ అసోసియెషన్ అధ్యక్షులు లింగమయ్య, ఉపాధ్యక్షులు గురునాథ్‌రెడ్డి, మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా యువతీ యువక ులకు దేశభక్తి, ఆరోగ్యరక్షణ పెంపొందుతుందని అన్నారు. పోలీస్, ఆర్మీ జవాన్ల అమరవీరుల స్మారకకార్యక్రమాలు చేపట్టేందుకు అన్ని మండలాల్లో నిర్వహించేందుకు జిల్లా ఎస్పి ఆదేశాలు జారీ చేయాలని కోరారు. కార్యక్రమానికి వికారాబాద్‌జిల్లా ఆర్మీఅసోసియేషన్ పూర్తి సహకారం అంది స్తామని తెలిపారు. పోలీస్ అమరవీరుల స్మారక కార్యక్రమానికి ఆర్మీ, రిటైర్డ్ జవాన్లకు ఆహ్వానం పంపిన జిల్లా పోలీసులకు కృత జ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి : ఎంఇవో

**షాబాద్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండల పరిధిలోని అప్పారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన యువకుడు సందీప్‌గౌడ్ విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిల్స్, లైబ్రరీ సామాగ్రి, సౌండ్‌బాక్స్, గ్రీన్‌బోర్డు తదితర వస్తువులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని, ప్రభుత్వ పాఠశాలలను పరిక్షించి పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఉపాధ్యాయులు తమవంతు కృషి చేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో అయితే ఇంటర్, డిగ్రీ చదివిన వారే పాఠాలు బోదిస్తారని, ప్రభుత్వ పాఠశాలల్లో అయితే బీఈడీ చదివిన వారు బోధిస్తారన్నారు. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. అటు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు రాజునాయక్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఉన్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

**షాబాద్, అక్టోబరు25, ప్రభాతవార్త:** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని నేడు మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని షాబాద్ ఇన్స్‌క్టర్ కాంతారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.... పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని షాబాద్‌లోని ఎంఎస్ గార్డెన్‌లో ఉదయం 9గంటల నుండి మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని, ఆరోగ్యవంతంగా ఉన్నవారు రక్తదానం చేయాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఫైలు నవీన్‌రెడ్డి, సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మెనూప్రకారం మధ్యాహ్నభోజనం అందించాలి

### - మండల విద్యాధికారి హరిలాల్

**బొంరాస్‌పేట్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మండల విద్యాధికారి హరిలాల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సూర్యనాయక్‌తాండ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పన కోసం అమ్మఆదర్శపాఠశాలపనులనుపెండింగ్ లేకుండా పూర్తిచేయాలని అన్నారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం వారంకు విద్యార్థులకు 3సార్లు గుడ్లు అందించాలి. ప్రతిరోజు, ఎఫ్ఆర్ఎస్, ఎండిఎం, ఎస్ఎంఎస్‌లను సమయానికి ఆన్లైన్ చేయాలని ఉపాధాయులు ప్రతిరోజు సమయపాలన పాటించాలన్నారు. ప్రతినెల 3వ శనివారం తల్లిదండ్రుల సమావేశంను ఏర్పాటుచేసి తల్లిదం డ్రులు హాజరుకావాలన్నారు. ఉపాధ్యాయులు, సిఆర్‌పి సోమ్లనాయక్ పాల్గొన్నారు.

## కొడంగల్ నుండి వికారాబాద్ జిల్లా కు నూతన బస్సు

**బొంరాస్‌పేట్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** కొడంగల్ నియోజకవర్గ కేంద్రం నుండి వికారాబాద్ జిల్లా కేంద్రంకు నూతన బస్సు సర్వీస్‌ను శుక్రవారం ప్రారంభించడం జరిగిందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి, బొంరాస్‌పేట్ పిఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొడంగల్, బొంరాస్‌పేట్ మండల కేంద్రాల నుండి వికారాబాద్ జిల్లా కేంద్రం నేరుగా నూతన బస్సు సర్వీస్‌ను ప్రారంభించడం జరిగిందని మండల ప్రజలు ఈ సౌకర్యంను ఉపయోగించుకోవాలని వారు కోరారు. బస్సు సర్వీస్ వికారాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం, గొట్టిముక్కుల, మోమిన్‌కలాన్, మోమిన్‌కుర్దు, నాగారం, మదన్‌పల్లి, మదన్‌పల్లి తాండ, బురాన్‌పూర్, బొంరాస్‌పేట్, తుంకిమెట్ల గ్రామాల మీదుగా ఉదయం 8గంటలకు, మధ్యాహ్నం 4గంటలకు కొడంగల్ మండల కేంద్రంకు, అక్కడి నుండి వికారాబాద్‌కు రెండుట్రిప్‌లు నడుపబడుతుందని అయన తెలిపారు. కావున సమీపగ్రామాల విద్యార్థులు, ప్రజలుఈ సౌకర్యంను ఉపయోగించుకోవాలని వారు కోరారు. పార్టీ అధ్యక్షులు నర్సిములు గౌడ్, మాజీ మార్కెట్‌కమిటీ చైర్మన్ వెంకట్‌రాములుగౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేషం, రాంరెడ్డి, కిష్టప్ప, వీరేశలింగం, నర్సింహనాయుడు, రవిగౌడ్, ఎస్సి సెల్ మండలఅధ్యక్షులు రాములు, భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.

## గ్రామాలను సందర్శించిన ఎంపిడిఓ

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబరు 25, (ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఆయా గ్రామాలను ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. మండలంలోని పెద్దఎల్కిచర్ల, గాలిగూడ, వనంపల్లి గ్రామాలను ఆయన సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరి శీలించారు. గ్రామాల్లో చేపట్టిన పారిశుద్య పనులు, వీధి దీపాల ఏర్పాటు, పింఛను పంపిణీతీరును ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీలలో గల రికార్డుల నిర్వహాన సరిగ్గా ఉండాలని ఆయన సంబధిత అధికారులకు సూచించారు. గ్రామంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండ ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు పాండురంగంగౌడ్, శ్రావణ్‌కుమార్, ఉన్నారు.

## ఉపాధిహామీలో ఉచితంగా పనులు

**జిల్లెడు చౌదరిగూడ, అక్టోబరు 25, (ప్రభాతవార్త):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉచితంగ భూ అభివృద్ధి పనులు చేసుకోవచ్చని టెక్నికల్ అసిస్టెంట్‌లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని ఫీర్జాపూర్ గ్రామంలో ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగాగ్రామంలో చేపట్టాల్సిన పనులను గుర్తించారు. గ్రామంలోని చిన్న సన్నకారు రైతులు తమ వివరాలు తెలియజేసి భూ అభివృద్ధి పనులు చేసుకోవాలని అన్నారురవికుమార్, నర్సింహులు, రమేష్ పాల్గొన్నారు.

## గౌసెపాక్ గ్యార్మి షరీఫ్ గోడపత్రిక విడుదల

**కొడంగల్, అక్టోబరు 25, ప్రభాతవార్త :** పట్టణంలోని మక్కా మాజీద్‌లో మాజీ ఉపసర్పంచ్ ఎస్ఎం గౌసన్ అధ్వర్యంలో గ్యార్మి షరీఫ్ గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎం గౌసన్ మాట్లాడుతూ గౌసెపాక్ గ్యార్మి వచ్చే శుక్రవారం నమాజ్ అనంతరం జమే మజీద్ నుండి మహబూబ్ సుభానిదర్గా వరకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేకప్రార్థనలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం దర్గాలో అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆఫీస్ కరీం, అష్రఫీ, మొహమ్మద్ సర్తజ్ హుసేన్, మిర్జా నీసారా ఉల్లా బేక్, అబిద్, అమీర్ హుసేన్, ఇసాక్ పాషా, ఖాయిరాత్ అలీ, జబ్బార్, చిస్తి, హైమత్‌ఖాన్, షబ్బీర్ అలీ, ఖాదర్, వాహేద్ రజా పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీచైర్మన్‌గా పరశురాం రెడ్డి

**పరిగి, అక్టోబరు 25, ప్రభాతవార్త :** పరిగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన్న గారి పరుశురాం రెడ్డిని ఏకగ్రీవంగా నియమించారు. పరిగిఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి సమక్షంలో ఏఎంసి చైర్మన్‌గా పరశురామ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ప్రకటించారు మండల నాయకులు, కాంగ్రెస్‌పార్టీ, కార్యకర్తలు, పరశురాం రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

# ఎన్‌జిటి కేసును వెంటనే ఉపసంహరించుకోవాలి

### ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, అక్టోబరు 25 (ప్రభాతవార్త):** వర్గల్ మండలంలో ఇండస్ట్రియల్ పార్కు నిర్మాణానికి ఆర్ అండ్ ఆర్ కాలనీ మల్లన్నసాగర్, కొండ పోచమ్మసాగర్ ముంపు గ్రామాల ప్రజలకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి గతంలో కెసిఆర్ ప్రభుత్వంలో వర్గల్, ములుగు మండలాల్లో 2 వేల ఎకరాల భూ సేకరణ చేశారని, అప్పటి కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఇండస్ట్రియల్ పార్కు భూసేకరణకు అడ్డుపడి ఎన్‌జిటిలో కేసులను వేశారని తక్షణమే కేసులను ఉప సంహరించుకోవాలని ఎఫ్‌డిసి మాజీచైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ ముంపు గ్రామాల యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన కోసం కెసిఆర్ కృషిచేయడం జరిగిందని అన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు ఇండస్ట్రియల్ పార్కును అడ్డుకొని పరిశ్రమలు రాకుండా కేసులు వేయడమే కాకుండా ముంపు గ్రామాల యువతకు, మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రాకుండా చేశారన్నారు. ఇండస్ట్రియల్ పార్కు వద్ద ఎక్కడైతే గతంలోని కెసిఆర్ ప్రభుత్వం భూ సేకరణ చేసిందో అక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ నాయకులు ఇప్పటి మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, కోదండరామిరెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు టెంట్లు వేసుకొని కూర్చొని ఎకరానికి రూ.50 లక్షలు ఇవ్వాలని గతం లో కెసిఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరి గిందని వంటేరు గుర్తు చేశారు. అంతేకాకుండా అప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎకరానికి 50 లక్షలు ఇప్పిస్తాం లేదంటే మీ భూములు మీకు ఇప్పిస్తామని రైతులకు చెప్పడం జరిగిందని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇండస్ట్రియల్ యజమానులను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకునే ప్రయత్నం చేస్తున్నార న్నారు. గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడే ఇలాంటి మోసాలకు ఎగబడితే నియోజకవర్గ ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో గజ్వేల్ అభివృద్ధి కోసం రూ. 170 కోట్ల నిధులు విడుదల చేస్తే అభివృద్ధిని అడ్డుకొని నిధులను మళ్లించారని విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతిని పక్కనబెట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయాలని డిమాండ్ చేశారు.

## కెసిఆర్ కాలనీలో శ్రమదానం

**రామాయంపేట మున్సిపాలిటీ, అక్టోబరు 25, ప్రభాతవార్త**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని కేసీఆర్ కాలనీ (డబుల్ బెడ్ రూమ్)లో కాలనీ వాసులు శుక్రవారం శ్రమదానం చేశారు. కొన్ని రోజులుగా విషసర్పాలు కాలనీలో సంచరిస్తున్నాయి. కాలనీ చుట్టూరా ముళ్లపొదలు, చెట్లు ఉండడంతో పాములు ఎక్కువగా ఉంటున్నాయని, అంతే కాకుండా రామాయంపేట పట్టణం కు రావడం, పోవడం చాలా కష్టంగా మారిందని కాలనీవాసులు వాపోయారు. అందులో రాత్రి సమయంలో అయితే పాములు చాలా కనిపిస్తున్నాయని, దీంతో కాలనీవాసులు భయబ్రాంతులకు గురవుతున్నా రని పేర్కొన్నారు. ఈ విషయమై కేసీఆర్ కాలనీ సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా అందరూ కలిసి శ్రమదానం చేసి ముళ్ల పొదలను, రోడ్డును శుభ్రం చేసినట్లు కాలనీ సంఘం అధ్యక్షుడు కట్ట ప్రభాకర్ తెలిపారు.

## రైతు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**కొమురవెల్లి, అక్టోబరు 25, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మర్రిముచ్చాలలో అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న రైతు వంగ మహేందర్‌రెడ్డి కుటుంబాన్ని శుక్రవారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. బాధిత రైతు కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సిలువేరు సిద్దప్ప, కాయిత రాజేందర్‌రెడ్డి, గీస బిక్షపతి, వంగ చంద్రారెడ్డి, తలారి కిషన్, బోడిగం కృష్ణారెడ్డి, వంగ రాణి, బద్దిపడగ నరసింహారెడ్డి, చదరుపల్లి నర్సింగరావు, బోడిగం వంశీ పాల్గొన్నారు.

## పట్టబద్రులు ఓటు నమోదు చేసుకోవాలి : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

**చిన్నశంకరంపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన పట్టబద్రులు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని ఆర్డీవో రమాదేవి సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై అధికారులకు పలు సూచనలు చేశారు. దరఖాస్తులు అందిన వెంటనే ధృవపత్రాలు పరిశీలించి వారి ఓటరుగా నమోదు చేయాలన్నారు. పట్టభద్రుల ఓటు నమోదుకు వచ్చే నెల 9,10 తేదీలలో ప్రత్యేక ఓటరు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## తపస్ జిల్లా ఉపాధ్యక్షురాలిగా మాధవి

**చిన్నశంకరంపేట, అక్టోబరు 25, ప్రభాతవార్త:** తెలంగాణ ఉపాధ్యాయ సంఘం జిల్లా మహిళ ఉపాధ్యక్షురాలిగా మాధవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తపస్ ఉపాధ్యాయ సంఘం మహిళా అధ్యక్షురాలు స్వరూప రాణి, ప్రధాన కార్యదర్శి సుజాతలు శుక్రవారం తెలిపారు. జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన మాధవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని మాధవి తెలిపారు.

## వ్యాపారస్తులకు ఇబ్బందుల్లేకుండా సీసీ రోడ్ల నిర్మాణం



పటాన్‌చెరులో వ్యాపారస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**పటాన్‌చెరు, అక్టోబరు 25, ప్రభాతవార్త:** వ్యాపారస్తులకు, వ్యాపార సముదాయాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నూతన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ నుండి పాత మార్కెట్ మీదుగా గౌతమ్ నగర్ శాంతినికేతన్ పాఠశాల వరకు రెండు కోట్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన రోడ్డు నిర్మాణం మూలంగా తమ వ్యాపారాలకు ఇబ్బంది కలుగడంతో పాటు పలు దుకాణాల్లోకి వర్షపు నీరు వస్తుందని వ్యాపరస్తులు ఇటీవల ఎమ్మెల్యే దృష్టికి తిసుకెళ్లగా ఇందుకు సానుకులంగా స్పందించిన ఎమ్మెల్యే జీఎంఆర్ శుక్రవారం ఉదయం కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యాపారస్తులు, జిహెచ్ఎంసి అధికారులతోకలిసి రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రోడ్డును కొద్ది మెర తొలగించడంతో రోడ్డు వేయాలని, రెండు వైపులా డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయంలో ప్రతి ఒక్కరూ సహకరించినప్పుడే పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని తెలిపారు.

## సిసి కెమెరాల ఏర్పాటుతో నేరాలు అదుపు

### మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి

**నర్సాపూర్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపు చేయవచ్చని మెదక్‌జిల్లా ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ పరిధిలో నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి, చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన నేర రివ్యూ మీటింగ్‌ను నిర్వహించారు. రివ్యూ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను తెలుసుకొని వాటిని త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. అదేవిదంగా రద్దీ ప్రాంతాల్లో సంస్థల్లో, గ్రామాల్లో సైతం సీసీ కెమెరాల ఏర్పాటు చేసేవిదంగా చేయాలని ఆయన ఆదేశించారు. అంతేగాక 100 కాల్స్ లపై ప్రత్యేక దృష్టి సారించాలని 100 కాల్ వచ్చిన వెంటనే ఇన్‌టైంలో అక్కడికి చేరుకోవాలని సూచించారు. ప్రజల్లో సైబర్ నేరాలను అదుపు చేయడానికి గాను అవేర్‌నెస్ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి, నర్సాపూర్ ఎస్ఐ లింగంతో పాటు కౌడిపల్లి, శివ్వంపేట, చిలిపిచెడ్ పోలీస్ స్టేషన్ల ఎస్ఐ లు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న శ్రీ తిరుమలనాథ స్వామివారి ఉత్సవాలు

**పూడూరు, అక్టోబరు 25, ప్రభాతవార్త ;** పూడూరు మండలం పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ గ్రామంలో జరుగుతున్న శ్రీతిరుమలనాథస్వామి ఉత్సవ (జాతర) కార్యక్రమాల్లో భాగంగా నాల్గవ రోజు శుక్రవారం శ్రీ స్వామివారి ఏకాంత సేవా, మానసపూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ పీఠాధిపతులు వెంకటదాసులవారి అధ్వర్యంలో నిర్వహించిన శ్రీ స్వామివారి ఏకాంతసేవా, మానసపూజా కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు శ్రీధర్‌గుప్తా, విజయనిర్మల గోవర్ధన్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గుప్తా, గోవార్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి తదితర జిల్లానుండి భక్తులు పెద్దఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

Main-IV(MDK)-oct 25:Main-IV(MDK)-oct 25.qxd 10/25/2024 9:14 AM Page 1



## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

**చిన్నకోడూరు, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని సిద్దిపేట సిటిజన్ క్లబ్ కార్యదర్శి బోనాల కక్కయ్య అన్నారు. గత యేడాది పదో తరగతిలో 10 మంది విద్యార్థులు 10 జిపిఎ సాధించడంతో చిన్నకోడూరు జిల్లా పరిషత్ పాఠశాల రాష్ట్రం లోనే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.30వేల విలువచేసే కంప్యూటర్‌ను సిటిజన్ క్లబ్ ఆధ్వర్యంలో అందజేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లబ్ ఆధ్వర్యంలో భవిష్యత్‌లో పేదవిద్యార్థుల కోసం మరిన్ని సేవాకార్యక్రమాలు చేపడుతామన్నారు.పాఠశాల హెచ్‌ఎం, క్లబ్ కార్యనిర్వాహక సభ్యులు గూడాల సురేష్, కడారి సిద్ధిరామేశ్వర్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు కనకరాజు, శ్రీనివాస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడిని సత్కరించిన మైనార్టీ నాయకులు



టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న వహీద్‌ఖాన్

**సిద్ధిపేట అర్బన్, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సిద్ధిపేట టిపిసిసి మైనార్టీ నాయకులు వహీద్‌ఖాన్ శుక్రవారం హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మైనార్టీల సమస్యలను మహేష్‌కుమార్‌గౌడ్‌కు వివరించినట్లు వహీద్‌ఖాన్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని మహేష్ కుమార్ తెలియజేశానని పేర్కొన్నారు. పార్టీని మరింత పటిష్ఠం చేయడానికి సైనికుల్లా పనిచేయాలని సూచించినట్లు తెలిపారు.

## సిఎం ఇంటిని ముట్టడిస్తాం




సమావేశంలో మాట్లాడుతున్న ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే చెల్లించాలని లేనియెడల సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై మిలిటెంట్ పోరాటాలు చేస్తామని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ఎఐఎస్ఎఫ్ జిల్లా అఫీస్ బేనర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకారం ఎంతో అందించారని, ఇది సిఎం రేవంత్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. పెండింగ్ ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు 27లోపు చెల్లించకుంటే ఇందిరాపార్కు వద్ద వేలాదిమంది విద్యార్థులతో హైదారాబాద్‌ను దిగ్బంధం చేస్తామని, అవసరమైతే సిఎం ఇంటిని ముట్టడిస్తామన్నారు. బకాయి స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బకాయిలు చెల్లించే వరకు ఎఐఎస్ఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ ప్రతినిధులు సంగెం మధు, జేరిపోతుల జనార్ధన్, రామగళ్ల నరేష్, వేల్పుల ప్రసన్నకుమార్, యాశీన్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు పంటలను కొనుగోలు కేంద్రానికి తెచ్చుకోవాలి



కొనుగోలు కేంద్రం వద్ద తేమ శాతాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

**కంగ్టి, అక్టోబరు 25 ప్రభాతవార్త:** కంగ్టి మండలంలోని రైతులు తమ సోయా పంటను డీసీఎంఎస్ నాగల్‌గిద్దా పరిధిలోని ఎంఎస్ మనూరు గోదాంనందు కొనుగోలు కేంద్రం నిర్వహిస్తున్నారు. ఈ కేంద్ర ఇంఛార్జిగా స్వప్న, సిబ్బంది శ్రీకాంత్ ఆధ్వర్యంలో సోయాపంటను గతవారం నుంచి కొనుగోలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ఈ నాణ్యత ప్రమాణాలు పాటించి సోయా శాతం 10 నుంచి 12 శాతం ఉండాలని రైతులకు కోరారు. ప్రభుత్వం మద్దతుధర రూ. 4892 కేటాయించిందని రైతులు గతంలో తమపంటను ఆన్‌లైన్లో నమోదు చేసుకున్న పంటల వివరాలను చూసుకుని కొనుగోలుకేంద్రం వద్ద తమ సోయా పంటను కొనుగోలు చేస్తుందని తెలిపారు. దళారులతో మోసపోకుండా ప్రభుత్వానికి అమ్ముకుని లాభం పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూసంఘాల ఆధ్వర్యంలో పెద్దశంకరంపేట బంద్



హిందూ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** హిందూ ఆరాధ్య దేవీదేవతల విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో హిందూసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వ్యాపార, వాణిజ్యసంస్థలు స్వచ్ఛందంగా తమ దుకాణాలను మూసివేసి నిరసన కార్యక్రమంలో పాల్గొని భారీ ర్యాలీ న్విహించారు. స్థానిక రామాలయం నుండి హిందూ సంఘాల బాధ్యులు అధికసంఖ్యలో పట్టణ పురవీధుల గుండా జై శ్రీరామ్, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ దేవీదేవతల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వం చట్టరీత్యా కఠినచర్యలకై డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల బీజేపీ అధ్యక్షులు కోణం విఠల్,హిందూసంఘాల ఐక్యవేదికబాధ్యులు పాల్గొన్నారు.

# కస్తూర్బాగాంధీ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు



కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** కస్తూర్బాగాంధీ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసిన ఎమ్మెల్యేకు పాఠశాల్లో వాటర్ ప్లాంట్, సోల్, ఫ్లోరింగ్ సమస్యలను ఎమ్మెల్యేకు ప్రిన్సిపల్ విజయ వివరించగా, వీటిని త్వరలోనే పరిష్కరిసామన్నారు.

### ప్రభుత్వకేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ ధాన్యం కొనుగోలుకేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని రామోజిపల్లి, శివాయిపల్లి, వీరోజిపల్లి, కొత్తపేట, బూర్గుపల్లి గ్రామాలలో ఐకెపి, పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. తహశీల్దార్ గ్రేస బాయి, ఎంపీడీవో రఫీక్ ఉన్నీసా, కాంగ్రెస్ అధ్యక్షులు మధు,సీనియర్ నాయకులు నారాగౌడ్, ఆర్ఎన్.సంతోష్,దాచ సంగమేశ్వర్, పెరుమాండ్ల గౌడ్,మాజీ ఎంపీపీ బాసాడ రాజు, రాజునాయక్,కుంట్ల రాములు,దేవేందర్,ఏపీఎం గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవరెడ్డి, సీఈవో రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ మహమ్మారి కాదు

**గజ్వేల్, అక్టోబరు 25 (ప్రభాతవార్త):** ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాలలో గజ్వేల్ లయన్స్ క్లబ్‌వారి ఆధ్వర్యంలో శుక్రవారం జంతుశాస్త్ర విభాగం సమక్షంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియానా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ నాగమున్నయ్య, కళాశాల సిపిడిసి మెంబర్ డాక్టర్ శైలజలు మాట్లాడుతూ క్యాన్సర్ అంటే ఒకప్పుడు భయం ఉండేదని, ప్రస్తుతం అది మహమ్మారి కాదు దానిని పూర్తిగా జయించవచ్చని అన్నారు. ప్రతి వ్యక్తిలో క్యాన్సర్ కణాలు ఉంటాయని, దానిని ముందు జాగ్రత్తతో పరీక్షలు చేయించుకొని జాగ్రత్త పడినప్పుడే దానిని జయించగలరన్నారు. అనంతరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు రూ.50వేల విలువైన వాటర్ ఫ్రీజర్‌ను డాక్టర్ శైలజ అందజేశారు. అనంతరం కళాశాల బృందం ముఖ్య అతిథులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, మహేంద్రవాడ లక్ష్మి, డాక్టర్ పి.జయరాజ్, శోభారాణి, శ్రీధర్, రమేష్, శ్యామ్, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పరమేశ్వరచారి, దొంతుల సత్యనారాయణ, మల్లేశంగౌడ్, సునీతారెడ్డి, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మహా పాదయాత్రకు తరలిన హుస్నాబాద్ నాయకులు



మహా పాదయాత్రలో పాల్గొన్న హుస్నాబాద్ నాయకులు

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** ఎస్సి వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో భద్రాచలం నుండి హైదరాబాద్ వరకు 1000కిలోమీటర్ల వరకు నిర్వహించనున్న మహాపాదయాత్రకు శుక్రవారం రోజున హుస్నాబాద్ నియోజకవర్గం నుండి మాల మహానాడు, మాల సంఘాలు, మాల ఉపకుల సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. శుక్రవారం భద్రాచలంలో ప్రారంభమైన ఈ పాదయాత్రకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ హాజరయ్యారు. నిర్వహించనున్న పాదయాత్ర నేటి నుండి 38 రోజుల వరకు కొనసాగి డిసెంబర్ 1న పాదయాత్ర హైదరాబాద్‌కు చేరకుని మాలల మహాసంగ్రామయాత్ర ద్వారా ముగుస్తుందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నుండి రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర చేస్తుందని మండిపడ్డారు. రిజర్వేషన్ల విషయంలో పార్లమెంట్‌లో న్యాయ శాఖ సలహా తీసుకుని రాష్ట్రపతి గెజిట్ ద్వారా మార్చాల్సి ఉండగా, మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టు ద్వారా రాష్ట్రాలకు అవకాశం ఇవ్వడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మహాపాదయాత్రలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జీ వెన్న రాజు, ఎస్సి రిజర్వేషన్ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్ ఆరె కిషోర్, నాయకులు జాల శ్రీనివాస్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి



గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న లైబ్రరీ చైర్మెన్ లింగమూర్తి

**హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు25, ప్రభాతవార్త:** జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ చైర్మెన్ కేడం లింగమూర్తి అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన గ్రంథాలయ నిర్మాణం కోసం ప్రభుత్వం నుండి రూ.30లక్షలు మంజూరయ్యాయని వాటితో త్వరితగతిన లైబ్రరీని పూర్తి చేసి త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. హుస్నాబాద్ తరహాలోనే గజ్వేల్,దుబ్బాక నియోజకవర్గాలతోపాటు మిరుదొడ్డిలో సైతం నూతన గ్రంథాలయాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పోటీపరీక్షలకు సన్నద్ధం అవుతున్న నిరుద్యోగ యువతకు, సాహితీవేత్తలకు గ్రంథాలయాలు ఉపయోగంగా ఉండేలా తయారు చేస్తామన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శివయ్య

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

**అక్కన్నపేట, అక్టోబరు25, ప్రభాతవార్త:** రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలంలోని మంచినీళ్ల బండ, నందారం, ధర్మారం, గ్రామాల్లో సేర్ప్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కష్టపడి పండించి, దళారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర ఎ-గ్రేడ్‌కు 2320 కాగా, బి-గ్రేడ్‌కు 2300 ఉందన్నారు. రైతులు ధాన్యాన్ని కళ్లాల వద్దే ఆరబెట్టుకుని, కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం శ్రీనివాస్, ఎఈవోలు, సింగిల్ విండో డైరెక్టర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వివోలు, వివోలు తదితరులు పాల్గొన్నారు.

## 13 ఎల్ కాలువను మళ్లించండి



ఆర్‌డివో కార్యాలయంలో వినతి పత్రం అందిస్తున్న ఇండ్ల యజమానులు

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 25, ప్రభాతవార్త:** గౌరవెల్లి ప్రాజెక్టు నుండి నీటిని సరఫరా చేసేందుకు డిస్ట్రిబ్యూట్ కెనాల్ పనుల్లో భాగంగా హుస్నాబాద్ నుండి వస్తున్న 13 ఎల్ కాలువను ఇతర ప్రాంతానికి మళ్లించాలని కోరుతూ ఇండ్లు, ఇండ్లస్థలాలు కోల్పోతున్న స్థలాల యజమానులు శుక్రవారం ఆర్‌డివో కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కాలువ హుస్నాబాద్ మున్సిపాలిటీలోని కమర్షియల్ భూములతో పాటు వ్యవసాయ, ఇండ్లు, ఇండ్లస్థలాల నుండి రావడం వల్ల తాము తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందన్నారు. ఈ కాలువ నిర్మాణం కోసం స్థల సేకరణ చేయాలని ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందని, ఇక్కడి నుండే కాలువ వచ్చినట్లయితే దాదాపు 100కు పైగా కుటుంబాలు రోడ్డునపడే అవకాశం ఉందన్నారు. ఈ విషయంపై అధికారులు ప్రభుత్వంతో చర్చలు జరిపి 13 ఎల్ కాలువను ఇతర ప్రాంతం నుండి ఏర్పాటుచేసే విధంగా సహకరించాలని వేడుకున్నారు. వినతిపత్రం అందించిన వారిలో మహేశ్వర్‌రెడ్డి, బూరుగు కిష్టస్వామి, జాల జ్యోతికుమార్, సావుల కోటేశ్వర్‌రావు, మిర్యాల రాజిరెడ్డి, పోలోజు శ్రీనివాస్, ములుకూరి నవీన్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యవిక్రయం

**నర్సాపూర్ రూరల్, అక్టోబర్ 25,ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునితా లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి తుల్జారాంపేట్, గూడెం గడ్డ, చిన్న చింతకుంట, రెడ్డిపల్లి, మంతూర్,కాజీపేట, తుజాల్‌పూర్, బ్రాహ్మణపల్లిలో కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ధాన్యానికి కనీస మద్దతుధర ప్రకారం,ఎ-గ్రేడ్ ధాన్యానికి 2320,కామన్‌గ్రేడ్ ధాన్యానికి 2300, సన్నరకం ధాన్యానికి అదనంగా 500రూపాయలు బోనస్ ఇస్తారని, కాబట్టి రైతులు మధ్యదళారులను ఆశ్రయించవద్దని విక్రయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో వైద్య శ్రీనివాస్, ఏపీఎం గౌరి శంకర్, ఏఈవో నీరిక్షణ, సీసీలు దేవిసింగ్, ప్రవీణ,భాగ్య, సీఎలు పర్వతాలు, పాండు,లక్ష్మీ, నాగరత్న, మంగజ్యోతి, స్వప్న, నవిత, లావణ్య ఆయా గ్రామాల మహిళా సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్ముకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నిజాంపేట (ఖేడ్), అక్టోబరు 25 ప్రభాతవార్త:** నిజాంపేట మండల పరిధిలోని జంబికుంట గ్రామంలో నూతనంగా ఎప్.పి.ఓ. కేంద్రంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే డా.పి.సంజీవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు, దళారుల మాటలు నమ్మి, మోసపోవద్దన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని, తూకం దగ్గర ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు సూచించారు. రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం రైతుల కొరకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ నూతన్‌కుమార్, మాజీ సర్పంచ్ సిద్దరఘుపతి రెడ్డి, రాధాకిషన్, లింగారెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, ఎప్.పీఓ చైర్మన్ నర్సయ్య, మల్లేశం, మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్ జగదీశ్వర్‌చారి, సాయిలు, మాణిక్, సంజీవరెడ్డి, రాంచందర్, నవాబ్, శంకర్ ముదిరాజ్, సంజీవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సాయాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జంబికుంట గ్రామప్రజలు తదితర నాయకులు పాల్గొన్నారు.

### ఆసుపత్రిని తనిఖీ చేసిన ఎమ్మెల్యే

మండల కేంద్రమైన నిజాంపేట పి.హెచ్‌సి ఆసుపత్రిని ఎమ్మెల్యే డాక్టరు పి.సంజీవరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం ఆసుపత్రిని తనిఖీ చేసి పలుసూచనలు సలహాలు ఇచ్చారు.ప్రభుత్వం తరపున వైద్యసౌకర్యాలు అందుతున్నాయా లేదా అని రోగులకు అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రభుత్వం పేదల కొరకు ప్రభుత్వ ఆసుపత్రులను నియమించి మంచి వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో డా. రాజేశ్వర్, ఆసుపత్రిసిబ్బంది, మండల నాయకులు మన్నె కృష్ణ, గోలి రాములు, మాజీ ఎంపీటీసీ లు రఘుపతిరెడ్డి, మాజీ సర్పంచ్ రాధాకిషన్, వెంకటేష్,శ్రీకాంత్, తదితర గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించిన ఎంపిడిఓ



తాత్కాలిక పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఎంపిడివో

**అక్కన్నపేట, అక్టోబరు25, ప్రభాతవార్త:** మండలంలో నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడ్డ సేవాలాల్ మహారాజ్ తండాలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం మండల ప్రజాపరిషత్ అధికారి బానోతు జయరాంనాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెట్లను పెంచేందుకు ఆర్ అండ్ ఆర్ కాలనీ సమీపంలో స్థలాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపివో గుగులోతు మోహన్‌నాయక్, ఏపివో ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి సతీష్, గోర్ సేవా సిద్ధిపేట జిల్లా అధ్యక్షులు బానోతు భాస్కర్‌నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## పశువుల సంతలో వెటర్నరీ డాక్టర్ ఉండాలి




మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న బిఎస్‌పి నాయకులు

**హుస్నాబాద్‌టౌన్, అక్టోబరు25, ప్రభాతవార్త:** హుస్నాబాద్ పట్టణ కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే పశువుల వారసంతలో వెటర్నరీ డాక్టర్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం రోజున బిఎస్పి నియోజకవర్గ ఇంచార్జీ పచ్చిమట్ల రవిందర్‌గౌడ్ తమ పార్టీ నాయకులతో కలసి మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హుస్నాబాద్‌లో పశువులసంత టెండర్‌ను గంగధార మండలానికి చెందిన కె.శ్రీనివాస్ బహిరంగ వేలంలో దక్కించుకున్నారని, ప్రభుత్వ నిబధనల ప్రకారం పశువులను అమ్మే క్రమంలో వాటిని వెటర్నరీ డాక్టర్ పరీక్షించాల్సి ఉండగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని తద్వారా పేద, మధ్యతరగతి రైతులు పశువులను పనులు,పాల కోసం కొనుగోలు చేసేందుకు అధికధరలు వెచ్చించాల్సి వస్తుందన్నారు. ప్రతి శుక్రవారం జరిగే పశువుల సంతలో వెటర్నరీ డాక్టర్‌ను సంతలోనే ఉంచి పశువులకు పరీక్షలు నిర్వహించి కటికె వారికి అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు వేల్పుల రాజు, ఎనగందుల శంకర్, దుండ్ర రాంబాబు, సుధాకర్, శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## అయోడిన్ ఉప్పు వాడండి.. ఆరోగ్యంగా ఉండండి



అయోడిన్ లోప నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**గుమ్మడిదల, అక్టోబర్ 25 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల పరిధిలోని అన్నారం గ్రామంలో అయోడిన్‌లోప నివారణపై ర్యాలీగా వెళుతూ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలాధికారి ఎంపీహెచ్‌వో ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అయోడిన్ లోపంతో వచ్చే పలువ్యాధుల గురించి స్పష్టంగా అర్థమయ్యేలా వివరించారు. అయోడిన్ లోపం వల్ల మరుగుజ్జు, గాయిటర్, స్త్రీలలో పీరియడ్స్ సక్రమంగా రాకపోవడం, అవయవ లోపంతో పిల్లలు పుట్టడం, బుద్ధిమాంద్యత రావడం, శరీరానికి కావాల్సిన హార్మోన్లు తక్కువగా ఉత్పత్తికావడం జరుగుతుందని వివరించారు. అయోడిన్‌లోపం రాకుండా ఉండాలంటే తినే ఆహారంలో అయోడిన్ ఉండేటట్లు చూసుకోవాలని, దీనికిగాను క్యారెట్, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, ఆవాలు, కర్రపెండలం, జేమ్స్‌గడ్డ లాంటి వాటిల్లో అయోడిన్ ఎక్కువగా ఉంటుందన్నారు. ఇవి ప్రతిరోజూ ఆహారంలో అలవాటుగా తీసుకోవాలని, అలాగే అయోడిన్ ఉన్న ఉప్పును వాడాలన్నారు. ఈ ఉప్పుకు ఎండ, గాలి, తడి తగలకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి శుభ, ఏఎన్ఎం వసంత, గ్రామపంచాయితీ కార్యదర్శి సంగీత, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, గర్భిణీస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలో అగ్నిప్రమాదం

### రూ.95లక్షల ఆస్తి నష్టం



పరిశ్రమలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగిన సంఘటన పట్టణకేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. చిన్నశంకరంపేట పట్టణ శివారులో ఉన్న ఎలిమెంటల్ కనెక్టర్స్ ప్రవేటు లిమిటెడ్ పరిశ్రమలో మొలలు తయారవుతాయి. ఉదయం కార్మికులు విధులకు హాజరై పనిచేస్తుండగా ఒక్కసారిగా పెద్ద మంటలు వ్యాపించడంతో వారు బటయకు పరుగులు తీశారు. పరిశ్రమ యజమాన్యం మెదక్, రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం, గాయాలు కాలేదని తెలిపారు. కాగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల సుమారు 95లక్షల రుపాయల విలువగల అట్టపెట్టెలు కాలిపోయాయని ప్యాకింగ్ మేనేజర్ జైకిసాన్, యజమాన్యం రాజేష్ అగర్వాల్ తెలిపారు. కాని అక్కడ పనిచేసే ప్రత్యక్ష సాక్షులు మాత్రం 5-10 లక్షల వరకు మాత్రమే ఆస్తినష్టం వాటిల్లిందని, పరిశ్రమలో అట్టపెట్టెలు తప్ప ఏ యంత్రాలు కూడా కాలిపోలేదని తెలిపారు. బీమా డబ్బుల కోసమే, ఉద్దేశపూర్వకంగానే ఇలా చేసి ఉంటారని ప్రమాదం స్పష్టంగా తెలుస్తుందని వారు తెలిపారు.